ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3 తమిళనాడు
TAMILNADU
సోమవారం 6 మే 2024



తిరునల్లారులో బ్రహ్మోత్సవాల ప్రారంభం

● ప్రత్యేక పూజలతో ధ్వజారోహణం



వృషభ పతకానికి పూజలు చేస్తున్న వేద పండితులు

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): తిరునల్లారు దర్భారణేశ్వరాయలంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఉదయం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. పుదుచ్చేరి కారైక్కాల్ జిల్లా తిరునల్లారులో ప్రాణాంబికై సమేత దర్భారణ్యేశ్వరస్వామివారి ఆలయం శనీశ్వరుడి క్షేత్రంగా విరాజిల్లుతోంది. నలచక్రవర్తికి దోష నివృత్తి లభించిన పుణ్యక్షేత్రంగా పేరొందిన ఈ ఆలయాన్ని దర్శించేందుకు ప్రతి శనివారం దేశవిదేశాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వస్తున్నారు. ఇంతటి విశేషాలు సంతరించుకున్న ఈ ఆలయంలో ప్రతియేటా బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయి. ఈ యేడాది బ్రహ్మోత్సవాలు ఆదివారం ఉదయం ధ్వజారోహణతో ప్రారంభమయ్యాయి. గణపతి తాళం, వృషభతాళం, చూర్ణిక మంత్రోచ్చారన, వేలాదిమంది భక్తుల నడుమ వృషభ ధ్వజాన్ని వేద పండితులు, ఆలయ ప్రధానార్చకులు ధ్వజ స్తంభంపై ఎగురవేశారు. ఈ ధ్వజారోహణానికి ముందు వృషభ ధ్వజాన్ని ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. తరువాత ధ్వజస్తంభంపైనున్న వినాయకుడికి అభిషేకాలు, దీపారాధన చేశారు. ఆలయంలోని మూలవిరాట్టు దర్భారణ్యేశ్వర స్వామికి ఇష్టమైన దర్భపుల్లలతో ధ్వజస్తంభం చుట్టూ అలంకరించారు. ఆ తర్వాత పంచమూర్తులైన స్వర్ణగణపతి, వళ్ళి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, ప్రాణాంబికై అమ్మవారు. దర్భారణ్యేశ్వరస్వామివారు, చండికేశ్వరస్వామి ప్రత్యేక అలంకారాలతో పల్లకీలో వీధుల్లో ఊరేగారు. ధ్వజారోహణ వేడుకల్లో ఆలయ నిర్వహణాధికారి కే అరుణగిరినాధన్, ధర్మపుర ఆధీన నిర్వాహకులు కందసామి తంబిరాన్ స్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ బ్రహ్మోత్సవాల్లో ఈ నెల 17 స్వర్ణ వృషభవాహనంలో స్వామివారి ఊరేగింపు, 19న రథోత్సవం నిర్వహించనున్నారు.



ధ్వజస్తంభానికి దీపారాధన చేస్తున్న ఆలయ ప్రధానార్చకులు



ఆసన్ పాఠశాల వద్ద వేచి ఉన్న తల్లిదండ్రులు

చెవిలోని కమ్మలు తీస్తున్న తల్లి

జడ పిన్ను తీసేస్తున్న దృశ్యం



బ్లూ టూత్ ఇయర్ ఫోన్ తీస్తున్న విద్యార్థి

కఠిన నిబంధనల నడుమ నీట్

● రాష్ట్ర వ్యాప్తంగా 31 కేంద్రాల ఏర్పాటు
● విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు



విద్యార్థినికి సూచనలిస్తున్న కానిస్టేబుల్

ప్యారీస్, మే 5: నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా కఠిన నిబంధనల నడుమ ప్రశాంతంగా ముగిసింది. దేశంలో అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సులు (ఎంబీబీఎస్), దంత విద్యాకోర్సులు (బీడీఎస్) కోర్సులు చేయాలనుకొనే విద్యార్థుల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష నిర్వహించింది. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు పటిష్ఠ నిఘా నడుమ ఈ పరీక్షలు సాగాయి. తమిళనాడులో ప్రభుత్వ, ప్రభుత్వ రాయితీ పొందుతున్న పాఠశాలల్లో చదువుకున్న 12,730 మంది విద్యార్థుల సహా దాదాపు 1.50 లక్షల మందికి పైగా ఈ పరీక్షలకు హాజరయ్యారు. రాజధాని నగరం చెన్నై, కాంచీపురం, తిరువళ్లూర్, కోయంబత్తూర్, కడలూరు, కరూర్, ధర్మపురి, ఈరోడ్, సేలం, తూత్తుకుడి, మదురై, దిండుగల్, కన్నియాకుమారి, వేలూరు, తంజావూరు, విల్లుపురం, నీలగిరి, తిరువారూర్, తిరువణ్ణామలై, రామనాధపురం, పుదుకోట సహా 31 నగరాల్లో నీట్ పరీక్షల కోసం ఏర్పాటుచేసిన కేంద్రాల్లో పటిష్ఠ నిఘా ఏర్పాటైంది. ఆంగ్లం, తమిళం సహా 13 భాషల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. పరీక్షా కేంద్రానికి 30 నిమిషాల ముందే రావాలని సూచించిన నేపథ్యంలో, నగరంలో పరీక్షా కేంద్రాలకు ఉదయం 10 గంటల నుంచే అభ్యర్థులు తమ తల్లిదండ్రులు, కుటుంబసభ్యులతో చేరుకున్నారు. స్థానిక థౌజండ్ లైట్స్ ఆసన్ మెమోరియల్ పాఠశాల ప్రవేశ ద్వారం వద్ద విద్యార్థినులు ధరించిన గాజులు, చెవిదిద్దులు, పుక్కుపుడక తదితరాలు తీయించిన తరువాతే లోపలికి అనుమతించారు. మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత వెళ్లిన విద్యార్థులను పరీక్షలకు అనుమతించలేదు. హాల్‌టిక్కెట్టు, గుర్తింపు ధ్రువ పత్రాలు లేని విద్యార్థులను కూడా అనుమతించలేదు. అభ్యర్థులందర్నీ మెటల్ డిటెక్టర్ ద్వారా తనిఖీచేశారు. పరీక్షా కేంద్రాల్లోకి పేపర్, బిట్ పేపర్, పెన్సిల్ బాక్స్ ప్లాస్టిక్ పౌచ్, కాలిక్యులేటర్, స్కేలు, ఎలక్ట్రానిక్ పెన్, చేతికి ధరించే హెల్త్ బ్యాండ్, హ్యాండ్ బాగ్, బ్రాస్‌లేట్, సెల్‌ఫోన్, మైక్రోఫోన్, బ్లూ టూత్ ఇయర్ ఫోన్, బెల్ట్, మని పర్సు, రిస్ట్ వాచ్, ఆహార పదార్థాలను కూడా తీసుకెళ్లేందుకు నిరాకరించారు. అయితే వేసవి కారణంగా వాటర్ బాటిళ్లను అనుమతించారు. ఇదిలా ఉండగా, నీట్ పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సులువుగా, సకాలంలో చేరుకొనేలా రాష్ట్రప్రభుత్వ రవాణా సంస్థలు ప్రత్యేక బస్సులు నడిపాయి. అదే విధంగా ఎంటీసీ సంస్థ కూడా నగరం నలుమూలల నుంచి సిటీ బస్సులు నడిపింది. నీట్ ఫలితాలు జూన్ 14న విడుదల చేయనున్నట్లు ఎన్టీఏ ప్రకటించింది.

నేటినుంచి ఈ-పాస్ విధానం అమలు

● జూన్ 30 వరకు అమలు ● ప్రభుత్వ ఆదేశాలు జారీ

అడయార్, మే 5: రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన ఊటీ, కొడైక్కెనాల్‌లకు పర్యాటకులు వాహనాల్లో వెళ్ళేందుకు ఈ-పాస్ విధానాన్ని ప్రభుత్వం సోమవారం నుంచి అమల్లోకి తెచ్చింది. మే 7వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు ఈ విధానం అమల్లో ఉంటుంది. మద్రాస్ హైకోర్టు ఆదేశాల మేరకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్టు ప్రభుత్వం ఆదివారం రాత్రి ఓ ప్రకటనలో పేర్కొంది. ఊటీ, కొడైక్కెనాల్ వంటి పర్యాటక ప్రాంతాలకు సీజన్ సమయాల్లో పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. పర్యాటకులు వాహనాల్లో రావడంతో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో స్థానికుల పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఇదే విషయంపై హైకోర్టులో పిటిషన్ దాఖలు కాగా, దీనిపై విచారణ జరిపిన హైకోర్టు ఈ-పాస్ విధానాన్ని అమలు చేసి, పర్యాటకుల వాహనాలను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో పర్యాటక, రెవెన్యూ, అటవీ శాఖల ఉన్నతాధికారులు సమావేశమై హైకోర్టు ఆదేశాల మేరకు ఈ-పాస్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ఈ విధానం మే 6వ తేదీ సోమవారం ఉదయం 6 గంటల నుంచి అమల్లోకి వచ్చింది. ఊటీ, కొడైక్కెనాల్ వంటి ప్రాంతాలకు వాహనాల్లో వెళ్ళాలనుకునే పర్యాటకులు విధిగా ఈ-పాస్ పొంది తీరాల్సిందే. ఇందుకోసం పర్యాటకులు ముందుగా "epass.tnega.org" అనే వెబ్‌సైట్‌లో ఈ పాస్‌ను సోమవారం నుంచి పొందొచ్చు. విదేశీ పర్యాటకులు ఈ-మెయిల్‌ను, స్వదేశీ పర్యాటకులు తమ మొబైల్ ఫోన్ నంబరు ఉపయోగించి ఈ-పాస్‌లు తీసుకోవచ్చు. ఈ విధానం ఈ నెల 7వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు ఆయా జిల్లాల కలెక్టర్లు అమలు చేయాలని ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. అదేసమయంలో సాధారణ పర్యాటకులకు మాత్రం ఎలాంటి అంతరాయం లేకుండా యధావిధిగా వెళ్ళవచ్చు.

వ్యాపార సంస్థలకు భద్రత కల్పించాలి

● జస్టిస్ కె.చంద్రు

ప్యారీస్, మే 5: రాష్ట్రంలో వ్యాపార సంస్థలపై దాడులు అడ్డుకొనేందుకు రాష్ట్రప్రభుత్వం భద్రత కల్పించాలని మద్రాసు హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి కె.చంద్రు డిమాండ్ చేశారు. నగరంలో ఆదివారం 41వ వ్యాపారుల దినోత్సవం సందర్భంగా తమిళనాడు వ్యాపారుల సంఘాల సమాఖ్య 6వ రాష్ట్రస్థాయి మహానాడు ఘనంగా జరిగింది. చెన్నై మండల అధ్యక్షుడు అరుణాచలమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ మహానాడులో అధ్యక్షుడు కొళత్తూర్ రవి, సినీనటుడు ఎస్వీ శేఖర్ సహా పెద్దసంఖ్యలో వ్యాపారులు పాల్గొన్నారు. ఈ మహానాడులో బియ్యం, గోధుమ, ఆహార ధాన్యాలకు జీఎస్టీ రద్దు చేయాలి, మే 5వ తేదీ ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలి, 60 ఏళ్లకు పైబడిన వ్యాపారులకు పింఛను ఇవ్వాలని తదితర పది తీర్మానాలను ఆమోదించారు.



వ్యాపారుల సంఘు మహానాడులో జస్టిస్ చంద్రు, నటుడు ఎస్వీ శేఖర్‌లకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నిర్వాహకులు

ఎంకేబీ నగర్‌లో బైక్ ర్యాలీ

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య సంఘాల మహానాడు సందర్భంగా స్థానిక ఎంకేబీ నగర్‌లో 41 మోటరు బైకులతో వ్యాపార సంఘాల ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. వానగరంలోని జీసెస్‌కాల్స్ వింగ్స్ కన్వెన్షన్ హాలులో ఆదివారం ఉదయం 41వ వాణిజ్య సంఘాల ఆరో మహానాడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తర చెన్నై జిల్లా విభాగా నేత సెంథిల్ మురుగన్ ఈ బైకుల ర్యాలీ ప్రారంభించారు. మహాకవి భారతినగర్ నుంచి మహానాడు ప్రాంతం వానగరం వరకూ ఈ మోటారు బైకుల ర్యాలీ కొనసాగింది.

రాష్ట్రంలో అప్రకటిత విద్యుత్‌కోతలు

● పీఎంకే నేత రాందాస్ ఆరోపణ



చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తుండటంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఆయన విడుదల చేసిన ఓ ప్రకటనలో.. రాజధాని నగరం చెన్నై, సబర్బన్ ప్రాంతాలు మినహా తక్కిన జిల్లాల్లో పగటిపూటే రెండు మూడు గంటలపాటు విద్యుత్‌కోత విధిస్తున్నారన్నారు. రాణిపేట, వేలూరు, తిరుపత్తూరు, తిరువణ్ణామలై, కడలూరు, కళ్ళకురిచ్చి, తిరునల్వేలి, తెన్‌కాశి, తూత్తుకుడి, రామనాధపురం, విరుదునగర్, శివగంగ, మదురై, తేని, దిండుగల్, తంజావూరు, కరూరు, నామక్కల్, ఈరోడ్ జిల్లాల్లో రోజూ గంట నుండి నాలుగు గంటలపాటు విద్యుత్ కోత విధిస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో ఈ వేసవిలో విద్యుత్ అవసరాలు విపరీతంగా పెరుగుతాయని తెలిసినా డీఎంకే ప్రభుత్వం పట్టించుకోకుండా విద్యుత్ కోతలు అమలు చేయడం భావ్యమేనా అని ఆయన ప్రశ్నించారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం అప్రకటిత విద్యుత్ కోతకు స్వస్తి చెప్పి నిరాటంకంగా విద్యుత్ సరఫరా చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

నేడు ప్లస్ టూ ఫలితాల విడుదల

● సెల్‌ఫోన్‌కే మార్కుల జాబితా

ప్యారీస్, మే 5: ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల ఫలితాలు ముందుగా ప్రకటించిన ప్రకారం సోమవారం ఉదయం 9.30 గంటలకు విడుదలవుతాయి. ఫలితాలను వెంటనే సెల్‌ఫోన్‌లో తెలుసుకొనే విధంగా రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సదుపాయం కల్పించింది. తమిళనాడు, పుదుచ్చేరిలోని 7,534 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలల్లో ప్లస్ టూ చదువుకుంటున్న విద్యార్థినీ, విద్యార్థులకు మార్చి 1 నుంచి 25వ తేది వరకు పబ్లిక్ పరీక్షలు నిర్వహించారు. రెండు రాష్ట్రాలకు చెందిన 7,72,200 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాశారు. వీరే కాకుండా ప్రైవేటు అభ్యర్థులు 21,875 మంది, 125 మంది ఖైదీలు పరీక్షలు రాశారు. అనంతరం టెన్త్ పబ్లిక్ పరీక్షలు మార్చి 26 నుంచి ఏప్రిల్ 8వ తేది వరకు జరిగాయి. ఈ రెండు పబ్లిక్ పరీక్షల మూల్యాంకనంలో సుమారు 40,000 మందికి పైగా టీచర్లు పాల్గొన్నారు. వారం రోజుల క్రితం ప్లస్ టూ మూల్యాంకనం పూర్తయింది. మార్కుల జాబితా తయారీ ప్రారంభమై శనివారంతో పూర్తయింది. సోమవారం ఉదయం 9.30 గంటలకు నుంగంబాక్కంలోని డీపీఐ ప్రాంగణంలో పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ ప్లస్ టూ పరీక్షా ఫలితాలు విడుదల చేస్తారు. విద్యార్థుల సెల్‌ఫోన్ నెంబర్లకు వెంటనే ఫలితాలతో పాటు మార్కుల వివరాలు కూడా పంపిస్తారు. ఇది కాకుండా విద్యార్థులు ఆయా పాఠశాలల్లో తమ ఫలితాలు తెలుసుకొనే సదుపాయం కల్పించారు. ప్రైవేటు అభ్యర్థులు తాము పరీక్ష రాసిన కేంద్రాలకు వెళ్లి ఫలితాలు తెలుసుకోవచ్చు. మరోవైపు ప్రభుత్వ పరీక్ష శాఖ www.dge1.tn.gov.in, www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్‌లు, జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, జిల్లాల్లోని గ్రంథాలయాల్లో కూడా ఫలితాలు తెలుసుకోవచ్చు.

కాంగ్రెస్ నేత మృతి కేసులో మలుపు

● మరో 2 లేఖలు లభ్యం
● ఓ అనుమానితుడి పరారీ

● విచారణకు సహకరిస్తా : రూబీ మనోహర్
● ఎన్నో అనుమానాలు : సెల్వపెరుంతగై



జయకుమార్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై



జయకుమార్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి కాంగ్రెస్ సీనియర్ నేత కేపీకే జయకుమార్ ధనసింగ్ మృతి కేసు దర్యాప్తులో దిగ్భ్రాంతికరమైన విషయాలు బయట పడుతున్నాయి. నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి మాయమైన జయకుమార్ తన కుటుంబీకులకు రాసిన రెండు లేఖలు లభ్యమయ్యాయి. శనివారం ఉదయం కరైసుత్తుపుదూరు తోటలో సగం కాలిన స్థితిలో మృతదేహాన్ని పోలీసులు పరిశీలించగా, జయకుమార్ హత్యకు గురై ఉంటాడనే అనుమానాలే అధికమయ్యాయి. జయకుమార్ శవం కాళ్లు చేతులు వైర్లతో కట్టేసి నేలపై బోర్లాపడి ఉండటాన్ని బట్టి ఆయన హత్యకు గురై ఉంటాడని పోలీసులు చెబుతున్నారు. అంతే కాకుండా ఆయన కడుపు వద్ద నల్ల కడప రాయి కూడా కట్టి ఉన్నట్లు పోలీసులు చెప్పారు. ఆదివారం ఉదయం పోస్టుమార్టం అనంతరం జయకుమార్ మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. ఆ తర్వాత ఆయన అంత్యక్రియలు క్రైస్తవ మతాచారాల ప్రకారం జరిగాయి. ఈ అంత్యక్రియలకు టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై తదితర పార్టీ నేతలు హాజరయ్యారు. పోస్టుమార్టం నివేదిక రెండు మూడు రోజుల తర్వాత వస్తుందని, ఆ నివేదిక పరిశీలించిన తర్వాతే జయకుమార్ హత్యకు గురయ్యారా? లేదా? అనే విషయం వెల్లడవుతుందని పోలీసులు చెప్పారు.

అనుమానితుల్లో ఒకరి పరారీ...

ఇదిలా ఉండగా జయకుమార్ తన ప్రాణాలకు కారకులవుతారంటూ ప్రకటించిన ఐదుగురిలో ఒకరు పరారీలో ఉండటంతో ఆయన ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. జయకుమార్ ఏప్రిల్ 30న తిరునల్వేలి డీఎస్పీ శిలంబరసన్‌కు 'మరణ వాంగ్మూలం' పేరుతో పార్టీ లెటర్ ప్యాడ్‌లో ఓ లేఖ పంపారు. ఆ లేఖలో తన ప్రాణాలకు ముప్పు వాటిల్లితే అందుకు నాంగునేరి ఎమ్మెల్యే రూబీ మనోహర్, కళ్ళికులం ఆలయ మాజీ ధర్మకర్త ఆనందరాజా. కుత్తాలింగం, ఇడయన్‌కుడి చెందిన జయకర్, పుదియంపుత్తూరుకు చెందిన జేసురాజా కారకులవుతారన్న విషయం విదితమే. వీరిలో ఒకరు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు ప్రకటించారు. పరారైన వ్యక్తి పేరు మాత్రం పోలీసులు గోప్యంగా ఉంచారు. ఇక జయకుమార్ డీఎస్పీకి రాసిన లేఖలో తాను పేర్కొన్న అనుమానితులపై కుటుంబీకులెవరూ కక్షసాధింపు చర్యలకు పాల్పడకూడదని, వారిపై పోలీసులే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ప్రత్యేకదళాలు..

జయకుమార్ హత్యకేసు దర్యాప్తుకు ఏడు ప్రత్యేక దళాలను నియమించినట్లు డీఎస్పీ శిలంబరసన్ తెలిపారు. ఏడీఎస్పీ కార్తికేయన్, వళ్ళియూడు డీఎస్పీ యోగేష్ నాయకత్వంలో ఈ ఏడు దళాలు విచారణ జరుపుతాయన్నారు. జయకుమార్ మృతదేహం లభించిన కొబ్బరి తోటలో ఆయన ఆదివారం అధికారులతో కలిసి మరోమారు పరిశీలించారు.

అల్లుడికి, కుటుంబీకులకు లేఖలు

జయకుమార్ డీఎస్పీకి లేఖ రాసినప్పుడే తన అల్లుడు జెబాకు, కుటుంబీకులకు వేర్వేరుగా రాసిన రెండు లేఖలను ఆదివారం ఉదయం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ లేఖలలో తాను అప్పులిచ్చినవారి వివరాలు, అదే విధంగా తాను రుణాలు తీసుకున్న వారి వివరాలు పేర్కొన్నారు. అల్లుడికి రాసిన మూడు పేజీల లేఖలో అల్లుడిగా కుటుంబ బాధ్యతలు చక్కగా నిర్వర్తించినందుకు ధన్యవాదాలు తెలుపుకున్నారు. ఆ తర్వాత ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలు రాసిపెట్టారు. కుటుంబీకులకు రాసిన లేఖలో తన కుమార్తె వివాహం ఘనంగా జరిపించడంలో సహకరించినవారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

విచారణకు సహకరిస్తా...

కాంగ్రెస్ నేత జయకుమార్ హత్యకేసు విచారణకు తాను అన్ని విధాలా సహకరిస్తానని నాంగునేరి కాంగ్రెస్ ఎమ్మెల్యే రూబీ మనోహర్ తెలిపారు. జయకుమార్ డీఎస్పీకి రాసిన లేఖలో ఐదుగురు అనుమానితులలో ఒకడిగా తన పేరు చేర్చినట్లు తెలుసుకుని దిగ్భ్రాంతి చెందానన్నారు. జయకుమార్ తాను చిరకాల మిత్రులమని, తమ మధ్య ఆర్థికలావాదేవీలున్నా ఎప్పుడూ గొడవలు రాలేదని, తమ ఇద్దరి మధ్య శత్రుత్వం లేదని రూబీ మనోహర్ స్పష్టం చేశారు.

ఎన్నో అనుమానాలు...

తిరునల్వేలి సీనియర్ కాంగ్రెస్ నేత జయకుమార్ మృతి కేసులో ఎన్నో అనుమానాలున్నాయని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై అన్నారు. ఆదివారం ఉదయం జయకుమార్ అంత్యక్రియలకు హాజరై భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి ఆయన నివాళులర్పించారు. ఆ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ జయకుమార్ మృతికి కారకులెవరో కనుగొని పోలీసులు వారిని కఠినంగా శిక్షించాలని, వారెంతటివారైనా, ఏ పార్టీకి చెందినవారైన సరే విడిచిపెట్టకూడదన్నారు. జయకుమార్ ప్రకటించిన ఐదుగురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరపాలని డిమాండ్ చేశారు. జయకుమార్ మృతిపై పార్టీ పరంగాను విచారణ జరుపుతున్నామని, ఆ విచారణ నివేదికను త్వరలో అధిష్ఠానానికి పంపుతామన్నారు. జయకుమార్ హత్యకు గురై ఉంటారనే తాము కూడా అనుమానిస్తున్నామని, అయితే ఈ విషయాన్ని నిర్ధారించాల్సింది పోలీసులేనన్నారు.

స్పీకర్ అప్పావు నివాళి..

ఇదిలా ఉండగా జయకుమార్ అంత్యక్రియల సందర్భంగా స్పీకర్ అప్పావు తదితర ప్రముఖులు ఆయన మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఎంపీలు విజయవసంత్, మాణిక్కం ఠాకూర్, జ్ఞానద్రవియం, మాజీ స్పీకర్ ఆవుడయప్పన్, ఎమ్మెల్యేలు ఊర్వశి అమృతరాజ్, రాజేష్‌కుమార్, ప్రిన్స్, మాజీ ఎమ్మెల్యే ఇన్బదురై, అన్నాడీఎంకే స్థానిక నాయకులు, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు కూడా జయకుమార్ భౌతికకాయంపై పూలమాలు సమర్పించి నివాళులర్పించారు.

సమాచార దర్శిని

నేటినుంచి డిగ్రీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, మే 5: రాష్ట్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు సోమవారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్నెట్ సెంటర్ల ద్వారా దరఖాస్తు చేసుకోలేని విద్యార్థులు ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల్లోని 'అడ్మిషన్స్ ఫెసిలిటేషన్ సెంటర్ (ఏఎఫ్‌సీ)'ల ద్వారా దరఖాస్తులు చేయవచ్చు. దరఖాస్తు ఫీజు రూ.48, నమోదు ఫీజు రూ.2 చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీలకు దరఖాస్తు ఫీజు లేదు కానీ, నమోదు ఫీజుగా రూ.2 చెల్లించాలి. ఫీజును డెబిట్, క్రెడిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్, యూపీఐ ద్వారా చెల్లించవచ్చు. వివరాలకు www. tngasa.in అనే వెబ్‌సైట్, 044-24343106, 24342911 నెంబర్లు సంప్రదించవచ్చని కళాశాల విద్య డైరెక్టరేట్ తెలియజేసింది.

కొడైకెనాల్‌కు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, మే 5: రాష్ట్రంలో నీలగిరి జిల్లా ఊటీ తర్వాత పర్యాటకులు అధికంగా దిండుగల్ జిల్లా కొడైకెనాల్‌కు వెళుతుంటారు. పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చే పర్యాటకులు దిండుగల్ రైల్వేస్టేషన్‌లో దిగి, అక్కడి నుంచి 2 కి.మీ దూరంలో ఉన్న బస్టాండ్ వెళ్లి కొడైకెనాల్ వెళ్లాల్సి ఉంది. ఈ దీనిపై దృష్టి సారించిన రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ దిండుగల్ రైల్వేస్టేషన్ నుంచి కొడైకెనాల్‌కు బస్సులు నడుపనుంది. ఆదివారం నుంచి తెల్లవారుజామున 4 గంటలు, 5.15, ఉదయం 6.45, 7.30 గంటలకు కొడైకెనాల్‌కు బస్సులు నడుపనున్నట్లు, రైల్వేస్టేషన్ నుంచి కొడైకెనాల్‌కు రూ.95, బస్టాండ్ నుంచి కొడైకెనాల్‌కు రూ.85 ఛార్జీగా నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

10న కామరాజ్ వర్సిటీ సిండికేట్ సమావేశం

పెరంబూర్, మే 5: కొత్త వైస్ చాన్సలర్ ఎంపికపై చర్చించేందుకు మదురై కామరాజ్ విశ్వవిద్యాలయ సిండికేట్ సమావేశం ఈ నెల 10వ తేది జరుగనుంది. వ్యక్తిగత కారణాలతో వర్శిటీ వైస్‌చాన్సలర్ ఇటీవల రాజీనామా చేశారు. ఆయన రాజీనామా ఆమోదించినట్లు రాజ్‌భవన్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో, కొత్త వీసీ ఎంపికపై చర్చించేందుకు శుక్రవారం సిండికేట్ సమావేశం జరుగుతుందని వర్సిటీ తెలియజేసింది.

రూ.2,399 రీఛార్జ్‌తో 395 రోజులు

● బీఎస్ఎన్ఎల్ ప్రత్యేక ఆఫర్

పెరంబూర్, మే 5: బీఎస్ఎన్ఎల్ 'ప్రీ పెయిడ్' వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్ ప్రకటించారు. ప్రైవేటు సంస్థలకు దీటుగా బీఎస్ఎన్ఎల్ సేవలందిస్తోంది. ప్రీ పెయిడ్, పోస్ట్ పెయిడ్, భారత్ ఫైబర్, బ్రాండ్ బ్యాండ్ అని పలురకాల సేవలను తక్కువ ధరకు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ప్రీ పెయిడ్ వినియోగదారులు రూ.2,399 రీఛార్జీతో 395 రోజుల వ్యాలిడిటీ, ప్రతిరోజు 2 జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లతో పాటు బీఎస్ఎన్ఎల్ ట్యూన్స్, జింగ్ మ్యూజిల్ తదితర సదుపాయాలు వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు.

ఆర్పీఎఫ్‌లో 4,660 పోస్టుల ఖాళీ

● 14లోగా దరఖాస్తులకు ఆహ్వానం

ప్యారీస్, మే 5: రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్)లో ఖాళీగా ఉన్న 4,660 పోస్టులకు ఆన్‌లైన్‌లో ఈ నెల 14వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రకటన విడుదలైంది. ఆర్పీఎఫ్‌లో 452 ఎస్ఐ పోస్టులు, 4,208 కానిస్టేబుల్ పోస్టులు ఖాళీలున్నాయి. ఎస్ఐ పోస్టులకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై, జూలై 1వ తేది నాటికి 20 నుంచి 28 ఏళ్లలోపుండాలి. ఈ ఉద్యోగాలకు ఎంపికయ్యే వారికి నెలకు రూ.35,400 వేతనం అందజేస్తారు. అలాగే, కానిస్టేబుల్ పోస్టులకు టెన్త్ ఉత్తీర్ణులై, జూలై 1వ తేది నాటికి 18 నుంచి 28 ఏళ్లు మించకుండా ఉండాలి. ఇందులో ప్రభుత్వ నిబంధనల మేరకు ఎస్సీ, ఎస్టీ విభాగాలకు ఐదేళ్లు, ఓబీసీ వర్గాలకు మూడేళ్ల వయోపరిమితి మినహాయింపు ఉంటుంది. ఈ పోస్టులకు దరఖాస్తు సమర్పించేందుకు ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికులు, మహిళలు, మైనార్టీలు రూ.250, ఇతరులు రూ.500 ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఉద్యోగాలకు ఎంపికయ్యే వారికి నెలకు రూ.21,700 వేతనంగా అందజేస్తారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష, దేహదారుఢ్య పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారినే ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని దక్షిణ రైల్వే ఓ ప్రకటనలో తెలిపింది.

బీచ్ - తిరువణ్ణామలై విద్యుత్ రైలులో పెరిగిన రద్దీ

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం ప్రారంభమైన బీచ్ - తిరువణ్ణామలై విద్యుల్ లోకల్ రైలులో రోజురోజుకూ ప్రయాణికుల రద్దీ పెరుగుతోంది. రోజూ బీచ్ స్టేషన్‌లో సాయంత్రం 6 గంటలకు బయలుదేరే ఆ రైలు రాత్రి 12 గంటలకు తిరువణ్ణామలై చేరుతుంది. 12 బోగీల ఈ రైలులో టాయ్‌లెట్ సదుపాయం కూడా ఉంది. చెన్నై బీచ్ నుంచి వేలూరు మీదుగా తిరువణ్ణామలైకి వెళ్లేందుకు ఈ రైలులో రూ.50లు ఛార్జీ వసూలు చేస్తున్నారు. ఇది బస్‌ఛార్జీతో పోల్చుకుంటే చాలా తక్కువగా ఉండటంతో ప్రయాణ సమయం ఎక్కువైనా ఫరవాలేదు కూర్చుని గమ్యస్థానం చేరవచ్చనే భావనతో ఈ రైలుకు డిమాడ్ పెరిగింది. ప్రస్తుతం వేసవి సీజన్ కావటంతో బస్సుల్లో వెళ్లేవారంతా ఈ రైలులో వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇక తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వరుడిని దర్శించే భక్తులకు కూడా ఈ రైలు అనువగా ఉంది. ముఖ్యంగా గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తులకు ఈ రైలు వరం లాంటిదని చెప్పవచ్చు. సాయంత్రం ఆరుగంటలకు బయలుదేరి రాత్రి 12 గంటలకు తిరువణ్ణామలై చేరి పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకుని, వేకువజాము నాలుగు గంటలకు అదే రైలులో ఉదయం 9.50 గంటలకల్లా నగరానికి తిరిగి రావచ్చని భక్తులు చెబుతున్నారు. అదే విధంగా ఉద్యోగులకు కూడా రోజూ సాయంత్రం ఐదుగంటలకు డ్యూటీ తరువాత ఆరుగంటలకు ఈ రైలెక్కి రాత్రి తిరువణ్ణామలై చేరుకోవచ్చు. మళ్ళీ మరుసటి వేకువజాము నాలుగు గంటలకు బయలుదేరి ఉదయం 9.50 గంటలకు నగరానికి చేరుకుని కార్యాలయాలకు వెళ్లొచ్చునని ఉద్యోగ సంఘాల నాయకులు చెబుతున్నారు. చెన్నై, కాంచీపురం, తిరువళ్లూరు, చెంగల్పట్టు జిల్లా వాసులకు కూడా ఈ రైలు చాలా సౌకర్యంగా ఉంది. ఈ నేపథ్యంలో ఈ మార్గంలో మరో విద్యుత్ రైలు సర్వీసును ప్రారంభించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

9న నెల్లూరులో తిరుమావళవన్ ఎన్నికల ప్రచారం

పెరంబూర్, మే 5: ఆంధ్ర రాష్ట్రం నెల్లూరు నియోజకవర్గంలో పోటీచేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ఈ నెల 9వ తేది ప్రచారం చేయనున్నట్లు డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్ తెలిపారు. తిరుచ్చి విమానాశ్రయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఆంధ్ర రాష్ట్రంలో కాంగ్రెస్ కూటమిలో పలు స్థానాలు, తెలంగాణాలో ఏడు స్థానాల్లో తాము పోటీచేస్తున్నామన్నారు. ముగిసిన రెండు విడతల లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి మెజార్టీ విజయాలు సాధిస్తుందనే వార్తలతో ప్రధాని మోదీ దిగ్భ్రాంతిలో ఉన్నారన్నారు. జరగబోయే ఐదు విడతల ఎన్నికల్లోనూ ఇండియా కూటమి అత్యధిక స్థానాలు కైవసం చేసుకుంటుందని తిరుమావళవన్ తెలిపారు.

కొనసాగుతున్న 'బర్డ్ ఫ్లూ' నియంత్రణ చర్యలు

పెరంబూర్, మే 5: కేరళ-తమిళనాడు రాష్ట్ర సరిహద్దుల్లో 'బర్డ్ ఫ్లూ' నియంత్రణ చర్యలు కొనసాగుతున్నాయి. కేరళ రాష్ట్రంలో కొద్దిరోజులుగా బర్డ్ ఫ్లూ లక్షణాలతో కోళ్లు, బాతులు మృతిచెందుతున్నాయి. ఈ వ్యాధి రాష్ట్రంలో వ్యాపించకుండా ఆరోగ్య శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. తమిళనాడు-కేరళ సరిహద్దుల్లో చెక్‌పోస్ట్‌లు ఏర్పాటుచేసి ఆరోగ్య, పశుసంవర్ధక శాఖ అధికారులు సంయుక్తంగా పర్యవేక్షిస్తున్నారు. కేరళ నుంచి వచ్చే వాహనాలపై క్రిమినాశిని మందు పిచికారీ చేసిన అనంతరం రాష్ట్రంలోకి అనుమతిస్తున్నారు. అదే సమయంలో కోళ్ల వ్యర్థాలతో రాష్ట్రంలో ప్రవేశించే కేరళ వాహనాలను అధికారులు అడ్డుకొని వెనక్కి పంపుతున్నారు.



నీలగిరి జిల్లా పట్టవయల్ చెక్ పోస్ట్‌లో కేరళ నుంచి వచ్చే వాహనాలకు క్రిమినాశిని మందుల పిచికారీ

బీమా అవినీతిపై పోరాటానికి సిద్ధమవుతున్న టీచర్లు

ప్యారీస్, మే 5: నూతన వైద్య బీమా అవినీతిపై రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల టీచర్ల సమాఖ్య పోరాటానికి సిద్ధమవుతోంది. ఈ మేరకు ఆ సమాఖ్య రాష్ట్రస్థాయి కార్యవర్గ నిర్వాహక సమావేశం నిర్ణయించిందని అధ్యక్షుడు మణిమేఘలై ప్రకటించారు. నూతన వైద్య బీమా పథకం కోసం ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్ల వేతనం నుంచి నెలానెలా రూ.300 జమ చేసుకుంటున్నారు. ఈ పథకం కింద ప్రభుత్వంచే గుర్తింపు పొందిన ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న టీచర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులకు ఉచిత చికిత్స అందించాల్సి ఉంది. అయితే సంబంధిత బీమా సంస్థలు చికిత్సకు సంబంధించిన పూర్తి మొత్తాన్ని చెల్లించకుండా 30 నుంచి 40 శాతం వరకు మాత్రమేఇస్తూ మోసం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇలాంటి అవినీతికి పాల్పడుతున్న బీమా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ ట్రెజరీల ముందు జూన్ 13న, రెండవ విడతగా 17న ఆందోళన చేపట్టనున్నట్లు టీచర్ల సమాఖ్య అధ్యక్షురాలు మణిమేఘలై తెలిపారు.

తిరుచెందూర్‌లో భక్తుల స్నానాలకు నిషేధం

పెరంబూర్, మే 5: సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో తిరుచెందూర్ సముద్రతీరంలో భక్తుల స్నానాలకు నిషేధం విధించారు. ఈ ప్రాంతంలో అలల ఉధృతి అధికంగా ఉండడంతో ఆలయ నిర్వాహకులు ముందుస్తు చర్యలు చేపట్టారు. అలాగే, సముద్రంలో ఎవరూ స్నానాలకు దిగరాదని లౌడ్ స్పీకర్ల ద్వారా పోలీసులు హెచ్చరించారు. ఆదివారం, వేసవి సెలవులు కావడంతో పెద్దసంఖ్యలో తిరుచెందూర్‌కు వచ్చిన భక్తులు సముద్రంలో పుణ్య స్నానాలకు నిషేధం విధించడంతో నిరాశచెందారు.

వరుణదేవుడి కరుణ కోసం ముస్లింల ప్రత్యేక నమాజు



శివగంగలో నమాజు చేస్తున్న ముస్లింలు

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లాలో నీటియెద్దడి రోజురోజుకూ తీవ్రరూపందాల్చటంతో వర్షం కోసం ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తమిళనాడు దవహీత్ జమాద్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ప్రత్యేక నమాజు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, యువకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సంస్థ జిల్లా విభాగం అధ్యక్షుడు రఫీక్ మహమ్మద్, కోశాధికారి మహమ్మద్ ఇస్మాయిల్ తదితరులు నాయకత్వం వహించారు.

రాహుల్‌కు ధన్యవాదాలు తెలిపిన కుకింగ్ ఛానెల్ పెరియతంబి



రాహుల్‌గాంధీ. పెరియతంబి

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): హృద్రోగంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తనను ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఫోన్‌చేసి పరామర్శించడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని విలేజ్ కుకింగ్ యూట్యూబ్ ఛానెల్ నిర్వహిస్తున్న పెరియతంబి తెలిపారు. ఆ మేరకు ఆదివారం ఆయన ఎక్స్ పేజీలో ఓ సందేశం పెట్టారు. విలేజ్ కుకింగ్ పేరుతో సుబ్రమణియన్, మురుగేశన్, అయ్యనార్, తమిళ్‌సెల్వన్, ముత్తుమాణిక్కం, పెరియతంబి కలిసి గ్రామీణ వంటల తయారీ పద్ధతులను వీక్షకులకు అందిస్తున్నారు. ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ ఓ పర్యాయయం రాష్ట్ర పర్యటనలో ఉన్నప్పుడు ఈ బృందం వండిన మష్‌రూమ్ బిర్యానీ ఓ పట్టుబట్టారు. ఇక ఈ బృందానికి నేతృత్వం వహించిన పెరియతంబి మార్చిలో హృద్రోగంతో తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఆ విషయం తెలుసుకున్న రాహుల్‌గాంధీ ఫోన్ చేసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపి పరామర్శించారు. ప్రస్తుతం సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకున్న పెరియతంబి ఆసుపత్రి పాలైనప్పుడు తనను పరామర్శించిన రాహుల్‌గాంధీకి ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

ఫుట్‌బోర్డు నుండి జారి పడి కండక్టర్ మృతి

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): నజరత్‌పేట వద్ద బస్ ఫుట్‌బోర్డు నుండి జారి పడిన కండక్టర్ మృతి చెందారు. తిరువణ్ణామలై జిల్లా సీమాపుదూరు గ్రామానికి చెందిన మురుగన్ (53) పూందమల్లి నుంచి కాంచీపురానికి వెళ్లే ప్రైవేటు బస్సులో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి పూందమల్లి నుంచి కాంచీపురం వైపు ఆ బస్సు వేగంగా వెళ్తుండగా ఎప్పటిలాగే మురుగన్ వెనుకవైపు ఫుట్‌బోర్డులో నిలిచి ప్రయాణించాడు. నజరత్‌పేట - బెంగళూరు రహదారిలో ఆ బస్సు వెళ్తుండగా ఎదురుగా కారు రావడంతో డ్రైవర్ బస్సును పక్కకు మరల్చాడు. దీంతో ఫుట్‌బోర్డుపై నిలిచిన మురుగన్ జారి రోడ్డుపై పడ్డాడు. ఈ సంఘటనలో అతడికి తలకు తీవ్రగాయమై ఆ స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. నజరత్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

నాయకులు సంఘానికి ఆదర్శవంతంగా ఉండాలి

● సీనియర్ పాస్టర్ ఎస్.రాజేంద్ర ప్రసాద్

● ఎంసీటీబీసీ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం



నూతన కార్యవర్గంతో రెవ. రాజేంద్ర ప్రసాద్, రెవ. గొంగటి సురేష్‌కుమార్

ప్యారీస్, మే 5: నాయకులైన ప్రతి వ్యక్తి, సంఘ విశ్వాసులకు, సంఘం బయటున్న జనాలకు, దేశానికి ఆదర్శంగా, సత్యవాక్యం ఆధారంగా పరిచర్య చేయడమే నిజమైన సేవా ధర్మమని మద్రాసు సెంటినరీ తెలుగు బాపిస్టు సంఘం (ఎంసీటీబీసీ) కాపరి రెవ.డా.ఎస్.రాజేంద్ర ప్రసాద్ సూచించారు. బ్రిటీష్ హయాంలో 1878వ సంవత్సరంలో స్థాపించిన ఎంసీటీబీసీ 2024-25వ సంవత్సరానికి నూతనంగా ఎంపికైన అధ్యక్షుడు జి.రామయ్య, కార్యదర్శి పోతల ప్రభుదాస్, కోశాధికారి ఎ.బాబులతో ఆదివారం జరిగిన ఆరాధనలో పాస్టర్ రాజేంద్ర ప్రసాద్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రకాశం జిల్లా పొదిలి సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చి పాస్టర్ గొంగటి సురేష్‌కుమార్ పాల్గొని దైవసందేశం అందించారు.

శివాలయ జీర్ణోద్ధరణలో బయల్పడిన ప్రాచీన విగ్రహం



తవ్వకాల్లో బయల్పడిన వళ్ళిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): అరియలూరు జిల్లా జయంకొండం సమీపం కూవత్తూరు గ్రామం మేల్ వీధిలో నాలుగు శతాబ్దాల నాటి విశాలాక్షి సమేత విశ్వనాథాలయం ఉంది. ఆ శివాలయం శిథిలమై ఆక్రమణలకు గురైంది. ఈ నేపథ్యంలో ఊరి ప్రజలంతా కలిసి ఆ ఆలయానికి పూర్వవైభవం కల్పించేందుకు సిద్ధమయ్యారు. ఆ మేరకు ఆలయ జీర్ణోద్ధరణ పనులు ప్రారంభించారు. ఎక్సకవేటర్‌తో తవ్వకాలు చేపట్టారు ఆదివారం ఉదయం ఆ ఆలయ సమీపంలో తవ్వుతుండగా ఓ చోట వళ్ళి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామివారి విగ్రహం బయల్పడింది. ఆ విగ్రహం అత్యంత ప్రాచీనమైనదిగా స్థానికులు భావిస్తున్నారు. ఆ విగ్రహాన్ని కూడా ఈ ఆలయంలోనే ప్రత్యేక సన్నిధి నిర్మించి ప్రతిష్ఠించాలని ఆలయ జీర్ణోద్ధరణ కమిటీ నిర్ణయించింది.

వర్షం కోసం వనదేవతలకు ఉత్సవాలు



వనదేవతలను కీర్తిస్తూ నృత్యం చేస్తున్న గిరిజనులు

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు జిల్లా ఉడుమలై సమీపం ఆనమలై పులుల అభయారణ్య ప్రాంతంలోని కోడందూరు, పొరుప్పారు, ఆట్టుమలై, ఈసల్‌తట్టు, తళింజి, కరుముట్టి, కాట్టుపట్టి గిరిజనులు వర్షం కోసం వనదేవతల ఉత్సవాలు జరుపుతున్నారు. ఆ మేరకు వనదేవతలైన మారియమ్మన్, సాప్లి అమ్మాళ్, తళింజి కొండమ్మాళ్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు రోజులుగా గిరిజన యువతులు వ్రతమాచరించి, వనదేవతలను కీర్తిస్తూ నృత్యాలు చేస్తూ సందడి చేశారు. చివరగా గిరిజనులు, వారి కుటుంబీకులు, చిన్నారులు ఒకరిపై ఒకరు పసుపు నీళ్లు కుమ్మరించుకునే వేడుకతో ఆదివారం మధ్యాహ్నం ఈ ఉత్సవాలు ముగిశాయి.

స్వీయ ప్రసవం చేసుకున్న నర్సు అరెస్ట్



పెరంబూర్, మే 5: నగరంలో తనకు తానే ప్రసవం చేసుకొని ఏడు నెలలు పసికందు మృతికి కారణమైన నర్సును పోలీసులు అరెస్ట్ చేసి పుళల్ జైలుకు తరలించారు. టి.నగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్న కన్నియాకుమారి జిల్లాకు చెందిన వినీషా 7 నెలల గర్భంతో ఉంది. గత నెల 30వ తేది ఆమెకు పురిటినొప్పులు రాగా, తన గదిలోనే ప్రసవం చేసుకొనేందుకు సిద్ధమైంది. తొలుత శిశువు కాళ్లు మాత్రమే బయటకు రాగా, శిశువు బయటకే తీసే వీలులేకపోవడంతో కాళ్లు నరికివేయగా శిశువు మృతి చెందింది. ఆ సమయంలో తీవ్ర రక్తస్రావమైన ఆమె ఎగ్మూర్‌లో ప్రభుత్వాసుపత్రిలో చేరింది. ఈ నేపథ్యంలో, మనీషా ఆరోగ్యం కుదుటపడడంతో పోలీసులు ఆమెను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

కుమార్తెకు లైంగిక వేధింపులు... పోక్సో చట్టం కింద కానిస్టేబుల్ అరెస్ట్

పెరంబూర్, మే 5: కన్నకూతురిని లైంగిక వేధింపులకు గురిచేసిన కానిస్టేబుల్ పోక్సో చట్టం కింద కటకటాల పాలయ్యాయడు. కడలూరు జిల్లా సాయుధదళంలో 45 ఏళ్ల వ్యక్తి కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. అతను కడలూరులోని పోలీస్ క్వార్టర్స్‌లో కుటుంబంతో సహా నివసిస్తున్నాడు. ఆయన 14 ఏళ్ల కుమార్తె పై అతడు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఈ విషయం ఎవరికి చెప్పాలో తెలియని బాలిక, జిల్లా ఎస్పీ రాజారామ్‌కు ఫిర్యాదుచేసింది. ఎస్పీ ఉత్తర్వులతో జిల్లా మహిళా విభాగం పోలీసులు పోక్సో చట్టంపై కేసు నమోదుచేసి కానిస్టేబుల్‌ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

పూందమల్లి బస్‌స్టేషన్‌లో 12 కిలోల గంజాయి స్వాధీనం

● ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, మే 5: స్థానిక పూందమల్లి బస్‌స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన పోలీసులు లగేజీతో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని 12 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని వారిని అరెస్ట్ చేశారు. ఆంధ్ర రాష్ట్రం నుంచి పూందమల్లి ప్రాంతానికి బస్సుల్లో కొంత మంది అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులకు సమాచారం తెలిసింది. దీంతో మహిళా ఎస్ఐ రాధ తన బృందంతో పూందమల్లి బైపాస్ రోడ్డులో ఉన్న బస్‌స్టేషన్‌కు ఆదివారం ఉదయం వెళ్లారు. అప్పుడు ఇద్దరు వ్యక్తులు సూట్‌కేస్‌లతో అనుమానాస్పదంగా నిల్చొని ఉండడం గుర్తించి వారిని ప్రశ్నించి, వారి సూట్‌కేస్‌లు తనిఖీ చేసి, ఐదు ప్యాకెట్లలో ఉన్న 12 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయితో వచ్చిన మణికంఠన్ (23), ముత్తురాజ్ (45)లను అరెస్ట్ చేశారు.

కిలో గంజాయితో పట్టుబడిన విజయ్ అభిమాని

తూత్తుకుడిలో విక్రయించేందుకు ఇంట్లో దాచిన కిలో 250 గ్రాముల గంజాయితో నటుడు విజయ్ అభిమాని పోలీసులకు పట్టుబట్టాడు. తూత్తుకుడి బీచ్ రోడ్డులో ఉన్న ఓ ఇంట్లో చట్టవిరుద్ధంగా గంజాయి దాచినట్లు సౌత్ జోన్ పోలీస్ ఇన్స్‌పెక్టర్ రాజారామ్‌కు సమాచారం అందింది. ఆదివారం ఉదయం ఆ ఇంటికి వెళ్లి తనిఖీ చేసిన పోలీసులు గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం విజయ్ అభిమాని భాస్కర్‌ను అరెస్ట్ చేసి విచారణ జరిపారు.

సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో...: స్థానిక సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో విశాఖ నుంచి వచ్చిన ఎక్స్‌ప్రెస్ రైలులో అక్రమంగా గంజాయి తరలించిన ముగ్గురిని అరెస్ట్ చేసిన ఆర్పీఎఫ్ పోలీసులు వారి నుంచి 21 కలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్న కేరళ రాష్ట్రం మలప్పురంకు చెందిన బాదీష్, మహమ్మద్ మజీద్ (28), అబ్దుల్ నసీర్ (27) అను శనివారం అరెస్ట్ చేశారు.



గంజాయితో పట్టుబడిన మణికంఠన్, ముత్తురాజ్

జూన్ వరకు నీటి కొరతలేదు

● వాటర్ బోర్డు ప్రకటన

ప్యారీస్, మే 5: రాష్ట్రవ్యాప్తంగా ఒక నెలకు అవసరమైన తాగునీరు అందుబాటులో ఉన్నందువల్ల జూన్ వరకు నీటి కొరతకు అవకాశం లేదని రాష్ట్ర ప్రభుత్వ వాటర్ బోర్డు ప్రకటించింది. ప్రస్తుతం ఎండలు మండుతున్న నేపథ్యంలో, నీటి అవసరం 228.6 కోట్ల లీటర్లకు పెరిగిందని, 5.02 కోట్ల మంది ప్రజలకు తాగునీరు కొరత లేకుండా పంపిణీ చేస్తున్నట్లు తెలిపింది. 2023వ సంవత్సరం కంటే ప్రస్తుతం 33.7 కోట్ల లీటర్ల తాగునీటి అవసరం పెరిగిందని తమిళనాడు తాగునీటి బోర్డు అధికారులు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం చేపట్టిన ముందస్తు చర్యల వల్ల రాష్ట్రంలో తాగునీటికి కొరత రాకుండా జిల్లాల వారీగా సమగ్ర తాగునీటి పథకాలు అమలు చేస్తున్నామని, జలవనరుల్లో నీటిమట్టాలు తగ్గకుండా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 13 కార్పొరేషన్లు, 70 మున్సిపాలిటీలు, 323 యూనియన్లు, 51,048 గ్రామ పంచాయతీలు, 576 పరిశ్రమలకు గత సంవత్సరం ఏప్రిల్ నెలలో 194.09 కోట్ల లీటర్ల నీటిని సరఫరా చేసినట్లు తెలిపారు. సేలం జిల్లా మేట్టూరు డ్యాం నుంచి అదనంగా విడుదల చేస్తున్న సెకనుకు 1,200 ఘనపుటడుగుల నుంచి 1,400 ఘనపుటడుగులుగా ఈ నెల 1వ తేది నుంచి పెంచినందువల్ల కావేరి నదీ పరివాహకంలో నివసిస్తున్న ప్రజలకు 281 సమగ్ర తాగునీటి పథకాల ద్వారా నీరు సరఫరా అవుతున్నట్లు వివరించారు. అదే విధంగా, తిరుచ్చి జిల్లాలో 12.1 కోట్ల లీటర్లు, పెరంబలూరు జిల్లాలో 1.4 కోట్ల లీటర్లు, కరూర్ జిల్లాలో 2.4 కోట్ల లీటర్లు, పుదుకోట కార్పొరేషన్‌లో 1.2 కోట్ల లీటర్లు, మదురై జిల్లాలోని వైగై నది ద్వారా 9 కోట్ల లీటర్లు, హోసూరు కార్పొరేషన్ హొగెనేకల్ నీటి పథకం ద్వారా 1.02 కోట్ల లీటర్లు, రామనాథపురం జిల్లాలో 7 కోట్ల లీటర్లు, కోవై జిల్లాలోని భవానీ నది, పిల్లూరు, సిరువాణి డ్యాంల ద్వారా కోటి లీటర్లు, విరుదునగర్ జిల్లాలో 2.2 కోట్ల లీటర్లు, కన్నియాకుమారి జిల్లాలో 3.1 కోట్ల లీటర్లు, తిరునల్వేలి జిల్లాలో 3.5 కోట్ల లీటర్లు, తిరువళ్లూర్ జిల్లాలో 70 లక్షల లీటర్లు, చెన్నై జిల్లాలో 107.2 కోట్ల లీటర్ల చొప్పున తాగునీటిని అందజేస్తున్నామన్నారు. సముద్రపు జలాలను తాగునీరుగా మార్చే పథకం అందుబాటులో ఉన్నందువల్ల అక్టోబరు వరకు నగరంలో తాగునీటి కొరతకు అవకాశముండదని చెన్నై మెట్రో వాటర్ బోర్డు స్పష్టం చేసింది.

రూ.4 కోట్ల స్వాధీనం కేసు... సీబీసీఐడీ విచారణ వేగవంతం

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా తాంబరం రైల్వేస్టేషన్‌లో రూ.4 కోట్ల నగదు స్వాధీనం కేసుపై సీబీసీఐడీ ముమ్మర దర్యాప్తు ప్రారంభించింది. ఈ కేసుకు సంబంధించి నగరంలోని ఓ బీజేపీ నాయకుడిని విచారించేందుకు సిద్ధమవుతున్నారు. నాంగునేరి బీజేపీ అభ్యర్థి నయినార్ నాగేంద్రన్‌కు అప్పగించేందుకు ఆ నగదును తిరునల్వేలికి తరలిస్తున్నట్లు ఆ సంఘటనలో అరెస్టయిన ముగ్గురు పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. నగదు స్వాధీనం కేసులో నయినార్ నాగేంద్రన్ నడుపుతున్న హోటల్ ఉద్యోగి నవీన్, ఆయన సోదరుడు సతీష్, శ్రీవైకుంఠం ప్రాంతానికి చెందిన డ్రైవర్ పెరుమాళ్, నయినార్ నాగేంద్రన్ బంధువు మురుగన్, అతడి వద్ద పనిచేస్తున్న ఆసైతంబిని పోలీసులు అదుపులోకి తీసుకుని ఎగ్మూరులోని సీబీసీఐడీ కార్యాలయంలో విచారణ జరిపారు. ఇక ఆ నగదు స్వాధీనం కేసులో నగరంలో మరో హోటల్ నడుపుతున్న బీజేపీ నేత గోవర్ధన్‌కు కూడా సంబంధాలున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. గోవర్ధన్ ప్రస్తుతం అనారోగ్యంతో నీలాంగరైలోని ఇంటిలోను ఉంటున్నారు. ఈ విచారణకు గోవర్ధన్ సహకరించే స్థితిలో ఉన్నారా? లేదా? అని తెలుసుకునేందుకు రెండు రోజుల క్రితం సీబీసీఐడీ పోలీసులు అతడి ఇంటికి వెళ్ళారు. న్యాయ నిబంధనల ప్రకారం గోవర్ధన్‌ను త్వరలో విచారణ జరిపేందుకు సీబీసీఐడీ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ కేసుకు సంబంధించి నయినార్ నాగేంద్రన్‌ను కూడా త్వరలో విచారణ జరుపుతామని అధికారులు తెలిపారు

కోతగిరిలో కందిరీగల దాడిలో ఇద్దరి మృతి

పెరంబూర్, మే 5: నీలరి జిల్లా కోతగిరిలో కందిరీగల దాడిలో ఇద్దరు పర్యాటకులు మృతిచెందగా, మరో ఏడుగురికి గాయాలయ్యాయి. కోవై చిత్తాపుదూర్ ప్రాంతం నుంచి మూడు కుటుంబాలకు చెందిన 9 మంది శనివారం నీలగిరికి విహార యాత్రకు వెళ్లారు. వీరు కోతగిరి హతరాయ్ లోయ ప్రాంతానికి వెళ్లారు. ఆ సమయంలో హఠాత్తుగా వర్షం కురవడంతో ఓ ప్రాంతం నుంచి ఎగిరిన కందిరీగలువారిపై దాడిచేశాయి.ఈఘటనలో తీవ్రంగా గాయపడిన వారిని చుట్టుపక్కల వారు కోతగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఫలించక రాజశేఖర్ (56), కార్తికేయన్ (56) మృతిచెందారు. ఈ ఘటనపై కోతగిరి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతానికి ఇద్దరు యువకుల మృతి

పెరంబూర్, మే 5: ఆలయానికి అలంకరించిన విద్యుద్దీపాలు తీస్తున్న సమయంలో హఠాత్తుగా విద్యుదాఘాతానికి గురై ఇద్దరు యువకులు మృతి చెందారు. తిరువణ్ణామలై జిల్లా సెంగం సమీపం మేల్‌వనక్కంపాడి గ్రామంలోని శివాలయం కుంభాభిషేక వేడుకలు గురువారం జరిగాయి. వేడుకల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. వేడుకలు ముగియడంతో శుక్రవారం దీపాలు తొలగిస్తున్న సమయంలో వర్షం కురిసింది. వర్షం ఆగిన వెంటనే అదే గ్రామానికి చెందిన సామికన్ను కుమారుడు అయ్యప్పన్ (20), జయరామన్ కుమారుడు అయ్యప్పన్ (22) దీపాలు తొలగిస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై స్పృహ తప్పి పడిపోయారు. చుట్టుపక్కల వారు వారిని వెంటనే సెంగం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే వారు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై మేల్ సెంగం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఎండ తీవ్రత... వడదెబ్బకు కార్మికుడి మృతి

ప్యారీస్, మే 5: రాజధాని నగరంలో ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో, వడదెబ్బకు ఉత్తరాదికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందగా, విల్లుపురానికి చెందిన మరో కార్మికుడు రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాష్ట్రంలో మరో మూడు రోజుల వరకు 109 డిగ్రీల ఫారన్‌హీట్ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం ప్రకటించింది. రాష్ట్రంలోని ఉత్తర జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు మరో నాలుగు రోజుల వరకు పెరుగుతాయని హెచ్చరించారు. పలు చోట్ల వీచిన వడగాల్పులకు ప్రజలు ఇబ్బంది పడ్డారు.ఈనేపథ్యంలో, వడదెబ్బకు గురవుతున్న ప్రజలకు చికిత్స అందించే విధంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రుల్లో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వార్డులు ఏర్పాటుచేసి చికిత్స అందిస్తున్నారు. ఆ మేరకు సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపంలోని రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో విల్లుపురానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు వేలు ఈ నెల 1వ తేది వడదెబ్బకు గురై చికిత్స పొందుతున్నారు. మీంజూరు బైపాస్ రోడ్డులో భవన నిర్మాణపనుల్లో పాల్గొన్న ఉత్తరాదికి చెందిన సచిన్(25) అనే కార్మికుడిని వడదెబ్బతో స్పృహకోల్పోయినస్థితిలో శనివారం అర్ధరాత్రి ఈఆస్పత్రికి తీసుకురాగా, అతడిని పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.

ఈదురుగాలులకు కూలిన ఇంటి పైకప్పు

● మహిళ మృతి

ప్యారీస్, మే 5: ధర్మపురిలో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీవర్షం కురిసింది. వేగంగా వీచిన ఈదురు గాలులకు ఓ ఇంటి పైకప్పు కూలడంతో ఓ మహిళ అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరు గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు. ధర్మపురి జిల్లాలో ఎన్నడూ లేని విధంగా పగటి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. జిల్లాలో ఈ నెల 2వ తేది 108.5 డిగ్రీల ఫారన్‌హీట్ ఉష్ణోగ్రత నమోదైంది. దీనికి తోడు శనివారం అగ్నినక్షత్రం ప్రారంభమైన నేపథ్యంలో, ధర్మపురిలో సాయంత్రం హఠాత్తుగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పలు ప్రాంతాల్లో చెట్లు విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కార్యమంగళం ప్రాంతంలో రాత్రి ఈదురుగాలులకు సెండ్రాయంపట్టి గ్రామంలో ఓ ఇంటి పైకప్పు కూలడంతో వర్షానికి తలదాచుకున్న గోవిందమ్మాళ్ (55) సంఘటనా స్థలంలోనే అక్కడికక్కడే మృతిచెందగా, తులసి (65), మహేశ్వరి (45)లకు తీవ్రగాయాలయ్యాయి. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, జిల్లాలో శనివారం రాత్రి ధర్మపురిలో 20, పాల్గాట్‌లో 17.4, పెన్నాగరంలో 46, హొగెనేకల్ 26.4, పాపిరెడ్డిపట్టి 5, మొరప్పూర్ 4 సెం.మీ అని మొత్తం 118.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

శ్రీపెరుంబుదూర్ సమీపంలో రోడ్డు ప్రమాదం

● ఇద్దరి మృతి

ప్యారీస్, మే 5: కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూర్‌లోని తండలం ప్రాంతంలో ఆదివారం ఉదయం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో మాజీ పంచాయతీ చైర్మన్ సహా ఇద్దరు మృత్యువాతపడ్డారు. తండలం పంచాయతి మాజీ చైర్మన్ వెంకటేశన్ తన ద్విచక్రవాహనంలో చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి దాటేందుకు యత్నించారు. ఆ సమయంలో శ్రీపెరుంబుదూర్ నుంచి పూందమల్లి వైపు బయల్దేరిన శివన్‌తాంగళ్ ప్రాంతానికి చెందిన రాజేష్ బైక్ హఠాత్తుగా వెంకటేశన్ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకటేశన్ అక్కడికక్కడే మృతిచెందగా, రాజేష్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రామాపురంలో సీఐ భార్య ఆత్మహత్యాయత్నం

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామాపురం ప్రాంతంలో సీఐ భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. రామాపురంలో నివసిస్తున్న కన్నన్ విరుగంబాక్కం పోలీసుస్టేషన్‌లో సీఐగా పనిచేస్తున్నారు. ఆయన భార్య కామాక్షి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం ఇంటిలో వంటరిగా ఉన్న కామాక్షి ఉన్నట్టుండి విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చిన కన్నన్ భార్య నోటిలో నురగలు కక్కుని పడి ఉండటం చూసి దిగ్భ్రాంతి చెందారు. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆమెకు చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిభారం వల్లే కామాక్షి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



లారీని మినీలారీ ఢీకొన్న దృశ్యం

పాకాల, మే 5: చిత్తూరు - తిరుపతి జాతీయ రహదారి పాకాల మండలం శంఖంపల్లె సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. సూళ్లూరుపేట నుంచి రాత్రి ఒంటి గంటకు చెప్పుల లోడుతో మైసూరుకు బయలుదేరిన మినీ లారీ శంఖంపల్లె సమీపంలో తెల్లవారుజామున ముందు ఆగివున్న లారీని వేగంగా ఢీ కొంది. ఈ ప్రమాదంలో తమిళనాడు వేలూరుకు చెందిన మినీ లారీ డ్రైవర్ వి.సురేష్ (49) తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం తిరుపతికి అంబులెన్స్‌లో తరలిస్తుండగా టోల్‌గేట్ సమీపంలో మృతి చెందాడు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పాకాల పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మారి సెల్వరాజ్ దర్శకత్వంలో

ధృవ్ విక్రమ్

- నేడు టైటిల్ వెల్లడి

ధృవ్ విక్రమ్ - మారి సెల్వరాజ్

దర్శకుడు మారి సెల్వరాజ్ తన ఐదో ప్రాజెక్టును ప్రకటించారు. ఇందులో చియాన్ విక్రమ్ తనయుడు ధృవ్ విక్రమ్ హీరోగా నటించనున్నారు. ఈ చిత్రం టైటిల్ సోమవారం వెల్లడించనున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్మెంట్స్, దర్శకుడు పా.రంజిత్‌కు చెందిన నీలం ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. 2018లో చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన మారి సెల్వరాజ్... ఈయన డైరెక్ట్ చేసిన తొలి చిత్రం 'పరియేరుం పెరుమాళ్' బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. ఆ తర్వాత 2021లో ధనుష్ హీరోగా 'కర్ణన్' చిత్రాన్ని తెరకెక్కించారు. అనంతరం 'వాళై' సినిమా రూపొందించారు. ఉదయనిధి హీరోగా గత యేడాది 'మామన్నన్' చిత్రాన్ని రూపొందించారు. ఈ సినిమాలన్నీ విజయం సాధించడంతో మారి సెల్వరాజ్ హిట్ డైరెక్టర్ల జాబితాలో చేరారు. ఈ నేపథ్యంలో ఆయన తన ఐదో ప్రాజెక్టును ప్రకటించారు. ధృవ్ విక్రమ్, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటించే ఈ చిత్రంలో పలువురు అగ్ర నటీనటులు ఇతర పాత్రలను పోషించనున్నారు.

నా ఎదుగుదలకు మీడియానే కారణం

- హీరో అర్జున్ దాస్

చిత్రజ్యోతి

చిత్రపరిశ్రమలో తనకంటూ ఒక స్థానం, ఒక స్థాయి రావడానికి, ఇలాంటి ఒక వేదికపై కూర్చొని మాట్లాడటానికి ప్రధాన కారణం మీడియా అని హీరోగా అర్జున్ దాస్ అన్నారు. విలన్ నుంచి హీరో స్థాయికి ఎదిగి ఇపుడు కోలీవుడ్‌లో అత్యంత బిజీ నటుడిగా, నటనతో పాటు తన గాత్రంతో ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తున్నఅర్జున్‌దాస్ శనివారం మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'నా సినీ ప్రయాణంలో మీడియా పాత్ర ఎంతో కీలకం. తప్పొప్పులను ఎత్తి చూపుతూ సరైన మార్గంలో వెళ్ళేలా మార్గనిర్దేశం చేస్తుంది. అలాగే సినీ కెరీర్‌లో అవకాశాలిచ్చిన దర్శకులకు, నిర్మాతలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాగా లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న రజినీకాంత్ 'కూలీ' చిత్రంలో ఇప్పటివరకు తనకు అవకాశం రాలేదని, ఒక వేళ అవకాశం వస్తే వదులుకోనని తెలిపారు.. ప్రస్తుతానికి డబ్బింగులు చెప్పడం లేదని, హీరోగా అవకాశాలు వరుసగా వస్తుండటంతో బిజీగా ఉన్నానని, అయితే, లోకేష్ ఏదో ఒక సీన్‌కు డబ్బింగ్ చెప్పాలని పిలిస్తే మాత్రం చెబుతానని వెల్లడించారు. ఇపుడు ప్రతినాయకుడి పాత్రలు చేయడం లేదని, అనేక చిత్రాల్లో ప్రధాన పాత్రల్లోనే నటిస్తున్నానని, దర్శకుడు లోకేష్ మాత్రం విలన్ పాత్ర చేయమంటే మాత్రం ఖచ్చితంగా చేస్తానని తన అభిప్రాయం వెల్లడించారు. డైరెక్టర్ శాంత కుమార్‌తో కలిసి 'రసవాది' చిత్రంలో పనిచేసిన అనుభవం మరిచిపోలేనిదని, 'మౌనగురు' తనకు బాగా నచ్చిన చిత్రమని,. 'రసవాది' చిత్రంలో ఆయుర్వేద వైద్యుడి పాత్ర అని, విశ్రాంతి కోసం కొడైక్కెనాల్ వెళ్ళగా అక్కడ ఏం జరిగిందన్నదే ఈ చిత్ర కథ. ఇందులో రొమాన్స్ కూడా ఉందని తెలిపారు. ఇపుడిపుడే చిత్రపరిశ్రమలో ఎదుగుతున్నానని ఇప్పట్లో పెళ్ళి ఆలోచన లేదని అర్జున్ స్పష్టం చేశారు. ఆ హీరోయిన్ నా బెస్ట్ ఫ్రెండ్. ఆమెతో నాకు సంబంధం ఉందంటూ వార్తలు రావడం దురదృష్టకరం.ముున్ముందు మంచి కథా చిత్రాల్లో నటిస్తూ ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయాలన్నదే నా లక్ష్యం.చేతిలో మధుమిత, వెంకట్ విశాల్‌తో పాటు మరికొన్ని చిత్రాలున్నాయి.తెలుగులో పవన్ కళ్యాణ్ 'ఓజీ' చిత్రంలో నటిస్తున్నాను' అని వివరించారు.



వెండితెరపై మళ్ళీ 'జో' కాంబినేషన్

2023లో నూతన దర్శకుడు హరిహరన్ రామ్ తెరకెక్కించిన చిత్రం 'జో'. రియోరాజ్, మాళవికా మనోజ్ హీరోహీరోయిన్లు. సూపర్ డూపర్ హిట్‌గా నిలిచిన 'జో' ఒక ప్రేమకథా చిత్రం. ఇందులో రియోరాజ్, మాళవిక కాంబినేషన్‌కు ఆడియన్స్ ఎంతగానో ఎంజాయ్ చేశారు. ఇపుడు ఈ జంట మరోమారు ప్రేక్షకులను అలరించేందుకు ముందుకురానుంది. మరో కొత్త డైరెక్టర్ కలైయరసన్ తంగవేల్ వీరి చిత్రాన్ని డైరెక్ట్ చేయనున్నారు. ఈ చిత్రం పూజా కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. ఇందులో పలువురు సినీ ప్రముఖులు పాల్గొని చిత్ర బృందానికి అభినందనలు, శుభాకాంక్షలు చెప్పారు. హరి, ముత్తయ్య వంటి దర్శకులతో అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించిన డ్రమ్‌స్టిక్ ప్రొడక్షన్స్, బ్లాక్ షీప్ కంపెనీ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నాయి. ఈ యేడాది ఆఖరులో చిత్రాన్ని విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. రియో రాజ్ - మాళవిక హిట్ కాంబినేషన్‌లో రూపొందే ఈ చిత్రానికి సిద్ధు కుమార్ సంగీతం సమకూరుస్తున్నారు.




రియోరాజ్, మాళవికా మనోజ్

అది వారిద్దరి వివాదం...

నాకు సంబంధం లేదు

- 'కూలీ' మ్యూజిక్ అంశంపై రజినీకాంత్

లోకేష్ కనకరాజ్ - రజినీకాంత్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'కూలీ'. ఇటీవలే చిత్ర టైటిల్‌తో పాటు టీజర్ రిలీజ్ చేశారు. ఈ టీజర్‌లో ఇళయరాజా సంగీతంలో రజినీకాంత్ నటించిన 'తంగమగన్' చిత్రంలోని 'వా వా పక్కం వా..' పాటను రీమిక్స్ చేసి డిస్కో డిస్కో అంటూ నేపథ్య సంగీతంగా ఉపయోగించారు. దీనిపై ఇళయరాజా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్‌కు కాపీ రైట్ నోటీసులు పంపించారు. ఇది కోలీవుడ్‌లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో 'వేట్టైయన్' చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని రజినీకాంత్ నగరానికి వచ్చారు. ఈ సందర్భంగా విలేకరులు ఇళయరాజా కాపీ రైట్ నోటీసులను ప్రస్తావించగా, 'అది ఇళయరాజాకు, చిత్ర నిర్మాతకు సంబంధించిన అంశం' అంటూ ఒక్క ముక్కలో సమాధానం చెప్పారు. పైగా 'కూలీ' టీజర్‌కు అద్భుతంగా రెస్పాన్స్ రావడం చాలా సంతోషంగా ఉందని, 'వేట్టయన్' చిత్రం 80 శాతం మేరకు షూటింగ్ పూర్తి చేసుకుందని ఆయన పేర్కొన్నారు.



రజినీకాంత్, ఇళయరాజా

పళని ఆలయానికి పోటెత్తిన భక్తులు



పళని పర్వతాలయం వద్ద గుమికూడిన భక్తులు

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్యదైవం సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారు కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో తృతీయ క్షేత్రంగా విరాజిల్లుతున్న పళని దండాయుధపాణి ఆలయాకిఇ ఆదివారం ఉదయం వేల సంఖ్యలో భక్తులు పోటెత్తారు. పాఠశాలలు, కళాశాలలకు ప్రస్తుతం వేసవి సెలవులు కావడం, ఉద్యోగులు, వ్యాపారులకు వారాంతపు సెలవులు రావడటం, ఆదివారం శుభముహూర్తం కూడా తోడటంతో వేల సంఖ్యలో భక్తులు పళని క్షేత్రానికి తరలివచ్చారు. పర్వతం దిగువన, గిరివీధి, బస్‌స్టాండు తదితర ప్రాంతాలు ఆదివారం వేకువజాము నుండే కిటకిటలాడాయి. మెట్లదారి, యానైపాదై, రోప్‌కార్ ప్రాంతాలల్లోనూ భక్తుల రద్దీ అధికమైంది. ఎండ అధికంగా ఉండటంతో పర్వాతాలయం చుట్టూ భక్తులకోసం కార్పెట్ పరిచారు. ఆ కార్పెట్‌ను తరచూ నీటితో తడిపారు. దీంతో భక్తులు కాళ్ళకు ఎండవేడి తగులకుండా నడిచి వెళ్ళి స్వామివారిని దర్శించారు. ఆదివారం శుభముహూర్తం దినం కావటంతో పళని నగరంలోని కల్యాణ మండపాల్లో పెళ్ళిళ్లు కూడా జరిగాయి. ఓ వైపు భక్తులు, మరో వైపు పెళ్ళివేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన జనాలతో పళని నగరం కిటకిటలాడింది.

కన్నియాకుమారి బోట్‌హౌస్ వద్ద

నీడ కోసం టార్పాలిన్ పైకప్పు

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి తీరంలోని పూంపుహార్ బోట్ హౌస్ వద్ద పర్యాటకులకు ఎండవేడి తగులకుండా నీడనిచ్చేలా టార్పాలిన్ గుడారాన్ని ఏర్పాటు చేశారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పర్యాటక ప్రాంతం కన్నియాకుమారిలో ప్రతిరోజూ త్రివేణి సంగమం వద్ద సూర్యోదయ, సూర్యాస్తమయం అద్భుత సన్నివేశాన్ని వీక్షించడానికి, తీరంలోని వివేకానంద స్మారక భవనం, తిరువళ్లువర్ విగ్రహ ప్రాంతాన్ని సందర్శించేందుకు వేలాదిమంది పర్యాటకులు వస్తుంటారు. పర్యాటకుల కోసం పూంపుహార్ సంస్థ రోజూ వివేకానంద స్మారక భవనం, తిరువళ్లువర్ విగ్రహ ప్రాంతాలకు మూడు పడవలను నడుపుతోంది. ప్రస్తుతం సెలవులు కావడంతో పర్యాటలకు సంఖ్య విపరీతంగా పెరిగింది. ఈ పడవలు బయలుదేరే ప్రాంతమైన బోట్‌హౌస్ వద్ద పర్యాటకులు తలదాచుకునేందుకు నీడ లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం అగ్ని నక్షత్రం ఎండలు కూడా తోడవటంతో పర్యాటకులు బోట్‌హౌస్ వద్ద చెమటతో తడిసిముద్దవుతున్నారు. పర్యాటకుల దుస్థితిని గమనించిన పూంపుహార్ సంస్థ వారికి నీడనిచ్చే విధంగా నీలిరంగు ప్లాస్టిక్ టార్పాలిన్‌తో గుడారం నిర్మించింది. ప్రస్తుతం బోట్ సవారీకి వెళ్లే ప్రయాణికులు ఎండవేడిమి తగుల కుండా ఆ ప్లాస్టిక్ టార్పాలిన్ నీడలో నిలిచి పడవ ప్రయాణానికి సిద్ధమవుతున్నారు. పూంపుహార్ సంస్థ టార్పాలిన్‌తో నీడ కల్పించినందుకు పర్యాటకులు ధన్యవాదాలు తెలుపుకుంటున్నారు.



కన్నియాకుమారి బోట్‌హౌస్ వద్ద ఏర్పాటైన టార్పాలిన్ పైకప్పు

సుందర మహాలింగానికి అభిషేకాలు



దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

ప్యారీస్, మే 5: విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూర్ సమీపంలోని వత్తిరాయిరుప్పు కొండపై వెలసిన చదురగిరి సుందర మహాలింగాలయంలో ఆదివారం చిత్తిరై ప్రదోష పూజలు వైభవంగా నిర్వహించారు. నాలుగు రోజుల వరకు స్వామివారిని దర్శనం చేసుకోనేందుకు రాష్ట్ర అటవీ శాఖ అనుమతులు మంజూరుచేసింది. చదురగిరి కొండపై ఉన్న ఆలయంలో అమావాస్య, పౌర్ణమి, ప్రదోష రోజులని నెలకు 8 రోజులు అటవీ మార్గంలో భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఆదివారం నుంచి 8వ తేది వరకు చిత్తిరై ప్రదోష వేడుకలు నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనేందుకు చెన్నై, కోవై, మదురై, విరుదునగర్, తిరుచ్చి ప్రాంతాల నుంచి వాహనాల్లో వెళ్లిన భక్తులను అటవీ సిబ్బంది చదురగిరి తరణిపారైలోని గేటు వద్ద ఆపారు. అక్కడి నుంచి కొండ మార్గంలో ఆలయానికి వెళ్లేందుకు అనుమతించారు. ప్లాస్టిక్ సంచులు, బీడీ, సిగిరెట్, మద్య పానీయాలు తరలించకుండా మెటల్ డిటెక్టర్‌తో భక్తులను తనిఖీచేశారు. రాహు కాలం ప్రారంభమైన 4.30 నుంచి 6 గంటల్లోపు సుందర మహాలింగం స్వామికి పాలు, పండ్లు, పన్నీరు సహా 18 రకాల అభిషేకాలు నిర్వహించారు. వత్తిరాయిరుప్పు, శ్రీ విల్లిపుత్తూర్ ప్రాంతాల నుంచి ప్రభుత్వ రవాణా సంస్థలు ప్రత్యేక బస్సులు నడిపాయి. మంగళవారం చిత్తిరై అమావాస్య సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో అక్కడకు తరలివెళ్లే అవకాశముందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

చిదంబరం ఆలయానికి కానుకగా శ్వేతాశ్వం



పెరంబూర్, మే 5: చిదంబరం నటరాజస్వామి ఆలయంలో అశ్వపూజ కోసం కొత్త గుర్రాన్ని ఓ భక్తుడు కానుకగా అందజేశారు. ఆ ఆలయానికి చెందిన 'రాజా' అనే గుర్రం ఏప్రిల్ 21న అనారోగ్యం కారణంగా మృతిచెందింది. దీంతో, చెన్నైకి చెందిన సెల్వరాజ్ అనే భక్తుడు ఆ ఆలయానికి తెలుపు గుర్రాన్ని కానుకగా అందజేశారు.

చెట్లు నరికివేయడంపై 'పసుమై తాయగం' వినూత్న నిరసన



నరికివేసిన చెట్టుకు అంజలి ఘటిస్తున్న నిర్వాహకులు

పెరంబూర్, మే 5: తిరువణ్ణామలై జిల్లాలో రోడ్డు విస్తరణ కోసం వందలాది చెట్లు నరికివేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు విరివిరిగా నాటాలని ప్రకటిస్తున్న ప్రభుత్వం, మరోవైపు రోడ్ల విస్తరణ పేరుతో చెట్లు నరికివేయడంపై పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో, ప్రభుత్వ తీరుపై 'పసుమై తాయగం' ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, ఆరణి లోక్‌సభ నియోజకవర్గ పీఎంకే అభ్యర్థి ఎ.గణేశ్‌కుమార్, పసుమై తాయగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.కన్నన్, నిర్వాహకులు వెంకటాచలం నేతృత్వంలో కార్యకర్తలు ఆ ప్రాంతానికి చేరుకొని నరికిన చెట్ల మొదళ్లకు పూలమాల వేసి నివాళులర్పించి నిరసన వ్యక్తం చేశారు.



దేవరకొండ రాజుకు సేవారత్న పురస్కారం అందజేస్తున్న గాన సరస్వతి శాంతి సురేష్, శ్రీనుబాబు

దేవరకొండ రాజుకు 'సేవా రత్న' పురస్కారం

ప్యారీస్, మే 5: సంఘసేవకులు, తమిళనాడు పీపుల్స్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు దేవరకొండ రాజుకు కళారంజని చారిటబుల్ ట్రస్ట్ 'సేవా రత్న' పురస్కారం ప్రదానం చేసింది. టి.నగర్‌లోని శ్రీకృష్ణ గానసభ వేదికగా శనివారం రాత్రి కళారంజని చారిటబుల్ ట్రస్ట్ స్కూల్ ఆఫ్ మ్యూజిక్ ఫెస్టివల్‌లో భాగంగా ఈ అవార్డు అందజేశారు. సంస్థ నిర్వాహకులు, సంగీత విద్వాంసులు డా.జె.శీనుబాబు సారథ్యంలో జరిగిన ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా గాన సరస్వతి శాంతి సురేష్, కలైమామణి డా.జయరామన్, బాలసుబ్రమణ్యం పాల్గొని రాజుకు పురస్కారం అందించారు. ఈ సందర్భంగా శీనుబాబు మాట్లాడుతూ... తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో సమాజసేవలో పాల్గొంటున్న దేవరకొండ రాజును పలు రంగాలకు చెందిన ప్రముఖుల మధ్య గౌరవించామన్నారు. దీనిపై స్పందించిన రాజు... కళారంజని అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగాయన్నారు. ఐక్యత కొరవడిన తెలుగు సంఘాలను ఏకం చేసి తెలుగువారి సమస్యలు పరిష్కరింపజేయడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో లవకుమార్‌కు కవి రత్న, ఉమా బాలసుబ్రమణ్యంకు భక్తి రత్న అవార్డులు ప్రదానం చేశారు. మాస్టర్ ఆకాష్, కార్యదర్శి 'సేవారత్న' ఆర్.రాజ్యలక్ష్మి కీ బోర్డు వాయించి శ్రోతలను అలరించారు.

వాహనచోదకులపై 'వాటర్ స్ప్రే'

పెరంబూర్, మే 5: తిరుప్పూర్ జిల్లాలో కొద్దిరోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. అలాగే, వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అగ్ని నక్షత్రం కూడా ప్రారంభమైంది. ఎండకు తోడు వడగాలులు ప్రారంభం కావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. ఇక, అవసరమైన పనుల నిమిత్తం తప్పక బయటకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో, తిరుప్పూర్ పెరియార్ కాలనీలోని ఇండియన్ పెట్రోల్ బంక్‌లో వాహనచోదకులు ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేలా ప్రత్యేక ఏర్పాటుచేశారు. బంక్ పైకప్పుపై పైపులు ఏర్పాటు చేసి అక్కడి నుంచి స్ప్రేయర్ ద్వారా నీటి తుంపర్లు పెట్రోల్, డీజిల్ కోసం వచ్చే వినియోగదారులపై పడేలా ఏర్పాట్లు చేశారు. ఈ సౌకర్యంతో వాహనచోదకులు కొద్దిసేపు ఎండ వేడి నుంచి ఉపశమనం పొందుతున్నారు.



పెట్రోల్ బంక్ పైకప్పు నుంచి వాటర్ స్ప్రే చేసిన దృశ్యం

వేదిక పైకి దూసుకెళ్లిన జల్లికట్టు ఎద్దు

- పరుగులు తీసిన నిర్వాహకులు

పెరంబూర్, మే 5: మైదానంలో పరుగులు తీస్తున్న ఎద్దు ఒక్కసారిగా వేదిక పైకి వెళ్లడంతో నిర్వాహకులు బెంబేలెత్తి పరుగులు తీశారు. శివగంగ జిల్లా తానిచ్చావూరణిలో ఆదివారం ఎద్దుల పోటీలు నిర్వహించారు. తాడు కట్టి మైదానంలో వదిలిన ఎద్దును నిర్ణీత సమయంలో 8 మంది క్రీడాకారులు అదుపుచేయాల్సి ఉంది. అలా, క్రీడాకారులకు చిక్కకుండా వెళ్లిన, ఎక్కువ ఎద్దులను అదుపుచేసిన క్రీడాకారులకు బహుమతులు అందజేస్తుంటారు. ఈ నేపథ్యంలో, పోటీ జరుగుతున్న సమయంలో ఓ ఎద్దుకు కట్టిన తాడు తెగిపోవడంతో క్రీడాకారులు దానిని అదుపుచేసేందుకు సాధ్యపడలేదు. ఆ ఎద్దు ఒక్కసారిగా పోటీ వేదికపై దూసుకెళ్లింది. ఈ హఠాత్ పరిణామానికి దిగ్భ్రాంతి చెందిన నిర్వాహకులు, వేదికపై ఉన్న వారు భయంతో పరుగులు తీశారు. అనంతరం ఎద్దు మెడకు తాడు కట్టడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం పోటీ యధావిధిగా సాగింది.



వేదికపైకి ఎద్దు రావడంతో పరుగులు తీస్తున్న నిర్వాహకులు

ఊటీ బొటానికల్ గార్డెన్‌లో పర్యాటకుల సందడి

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతం ఊటీలో ఆదివారం దేశవిదేశాల నుంచి వచ్చిన పర్యాటకులు సందడి చేశారు. ముఖ్యంగా రోజ్ గార్డెన్, బొటానికల్ గార్డెన్ ప్రాంతాలను సందర్శించేందుకు ఆసక్తి కనబరిచారు. ప్రస్తుతం అగ్నినక్షత్రం ఎండలు అధికంగా కాస్తున్నా ఊటీలో గత రెండు రోజులుగా మధ్యాహ్నం వేళల్లో చిరుజల్లులు కురిశాయి. దీంతో అంతటా చల్లదనం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆదివారం వేకువజాము నుంచే పర్యాటకుల సందడి అధికమైంది. ఉద్యానవనాల్లో కొత్తగా వికసించిన రంగురంగుల పూలను తిలకించేందుకు పర్యాటకులు గుమికూడారు. బొటానికల్ గార్డెన్‌లో పర్యాటకులు కుటుంబ సభ్యులతో కలిసి సెల్‌ఫోన్‌లలో పోటోలు తీసుకున్నారు.





వెళ్లిగుమ్మిఆట్టంలో భక్తులు

ఆలయ వేడుకల్లో వెళ్లిగుమ్మిఆట్టం


పెరంబూర్, మే 5: సేలం జిల్లా ఓమలూరు సమీపం సెమ్మాండపట్టి అన్నమార్ స్వామి ఆలయ కుంభాభిషేకం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపరాధన నిర్వహించారు. అనంతరం దేశంలోని పుణ్యనదీ జలాలతో కూడిన కలశాలను ఆలయానికి ఊరేగింపుగా తీసుకొని రాజగోపురంపై ప్రోక్షించి కుంభాభిషేకం నిర్వహించారు. వేడుకల్లో భాగంగా రాత్రి నిర్వహించిన వెళ్లిగుమ్మిఆట్టంలో పిల్లల నుంచి పెద్దలు వరకు పాల్గొని నృత్యం చేశారు.

పోలెండ్ యువతితో తమిళ యువకుడి ప్రేమ వివాహం

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): పోలెండ్ యువతి, తమిళ యువకుడి వివాహ వేడుక ఆదివారం ఉదయం ఘనంగా జరిగింది. కృష్ణగిరి జిల్లా వేప్పన్‌పల్లి సమీపం సూర్యనపల్లి గ్రామానికి చెందిన రమేష్ (33) ఉన్నత చదువుల అనంతరం అమెరికాలోని విల్లనోవా విశ్వవిద్యాలయంలో ఉద్యోగం చేస్తున్నాడు. అంతకు ముందు పోలెండ్‌లో చదువుతున్నపుడు రమేష్‌కు పోలెండ్‌కు చెందిన ఎవలినా మేత్రో (30) అనే యువతితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త ప్రేమగామారింది. వీరి ప్రేమ గురించి తెలుసుకున్న ఇరువురి కుటుంబీకులు పెళ్ళికి పచ్చజెండా ఊపారు. పెళ్ళికోసం ఇద్దరూ నెలరోజులు సెలవు పెట్టి కృష్ణగిరికి చేరుకోవడంతో పెళ్ళి ఏర్పాట్లు జరిగాయి. యువతి వైపు కుటుంబీకులు రెండు రోజుల క్రితం కృష్ణగిరి వచ్చారు. ఆ తర్వాత ఆదివారం ఉదయం హిందూ సంప్రదాయం ప్రకారం వీరి వివాహం జరిగింది. ఈ పెళ్ళికి ఇరువురి స్నేహితులు, బంధువులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



వధూవరులు రమేష్, ఎవలినా మేత్రోతో కుటుంబీకులు



మీకు మళ్లీ ఓటెందుకెయ్యాలి?

తిరుపతి - ఆంధ్రజ్యోతి

తొలిసారి గెలిచినపుడు ఎలా ఉండేవాడు.. రెండోసారి విజయం తర్వాత ఎలా మారిపోయాడు.. అనే మాటలు సూళ్లూరుపేట నియోజకవర్గంలో సిటింగ్ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గురించి వినబడుతూ ఉంటాయి. అప్పటి అమాయకత్వం, మృదుభాషణ, సౌమ్యత, వినమ్రత.. ఇవన్నీ ఏమయ్యాయి అని అందరూ ఆశ్చర్యపోతుంటారు. ఆయనలోని ఈ మార్పును తొలిగా ప్రశ్నించింది సొంతపార్టీవారే కావడం విశేషం. మాట చెప్పి మడమ తిప్పే తమ నాయకుడు జగన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకున్న కిలివేటి సంజీవయ్య సూళ్లూరుపేట నియోజకవర్గంలోనూ అదే పాటించారు. అభివృద్ధి ఇసుమంతైనా చేయకపోగా అవినీతి ఆరోపణలను లెక్కకుమిక్కిలిగా మూటగట్టుకున్నారు. సొంతపార్టీలోనే కట్టుదప్పిన శాంతిభద్రతలను దారిలో పెట్టలేక నిస్సహాయంగా చూస్తూవుండిపోయిన ఆయన సరిహద్దు నియోజకవర్గం అయిన సూళ్లూరుపేట భద్రతకు ఏమి భరోసా ఇస్తారని జనం అంటున్నారు. మూడోసారీ తనకే ఓటేయండని ఏ మొహం పెట్టుకుని అడుగుతారని ప్రజలు ప్రశ్నలు సంధిస్తున్నారు.



కొందరికే ప్రాధాన్యం

సంజీవయ్య రెండవ సారి గెలిచాక అక్రమార్జన గురించి తప్ప మరేమీ పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. రెడ్డి సామాజికవర్గాన్ని పూర్తిగా పక్కన పెట్టారని, తన అక్రమార్జనకు సహకరించే కొందరిని మాత్రమే దగ్గరగా పెట్టుకున్నారని నియోజకవర్గం హోరుమంటోంది.

హామీలు మరచి.. అవినీతి పెరిగి..
మనిషే మారెనూ..

మత్స్యకారులపై నోరు జారారు

గతేడాది జూన్‌లో తడ మండలానికి చెందిన మత్స్యకారులు తమ సమస్యలు చెప్పుకుందామని తన నివాసానికి రాగా వారిని కుక్కల్లాగా మీద పడుతున్నారంటూ దూషించారు. బయటకు వెళ్ళమని గదమాయించారు. దీంతో ఆగ్రహించిన మత్స్యకారులు ఎమ్మెల్యే నివాసం ఎదుట ధర్నాకు దిగారు. ఎన్నికల్లో ఓట్ల కోసం తమ గ్రామానికి ఎలా వస్తావో చూస్తామని హెచ్చరించి వెళ్లారు.

నెల్లూరులో నివాసం.. అవస్థల్లో జనం

నాయుడుపేటలో సొంత ఇల్లు, ఇతర ఆస్తులు వున్నప్పటికీ ఎమ్మెల్యే తొలినుంచీ నెల్లూరులోనే నివాసముంటున్నారు. పనులున్న జనం, కార్యకర్తలు, ఆయన్ను వెతుక్కుంటూ నెల్లూరు వెళ్ళాల్సి వస్తోంది. ఎమ్మెల్యే కోసం నెల్లూరు వెళ్ళాలంటే తడ నుంచీ 92 కిలోమీటర్లు, సూళ్ళూరుపేట నుంచీ 80 కిలోమీటర్లు, దొరవారిసత్రం, పెళ్ళకూరు మండలాల నుంచీ 77, నాయుడుపేట నుంచీ 65 కిలోమీటర్లు, ఓజిలి నుంచీ 53 కిలోమీటర్లు చొప్పున ప్రయాణించాలి. తిరుగు ప్రయాణంతో కలిపి చూస్తే తడ వాసులు 200 కిలోమీటర్లు, మిగిలిన మండలాల వాళ్ళు 110 నుంచీ 160 కిలోమీటర్లు ప్రయణించాలి. బస్సు ఛార్జీలు తడిసి మోపెడవుతాయి.



పేట ప్రజల చెవిలో సంజీవయ్య పూలు

గత ఎన్నికల ప్రచారంలో కిలివేటి సంజీవయ్య నియోజకవర్గ ప్రజలకు ఎన్నో హామీలిచ్చారు. అవి నెరవేర్చకుండానే మళ్లీ ఓటెయ్యమంటూ అడుగుతున్నారు. ఆయన ఇచ్చిన హామీల్లో కొన్ని...

హామీ: నెర్రికాలువ ఆధునికీకరణ
అమలు తీరు: దొరవారిసత్రం, సూళ్ళూరుపేట, తడ మండలాల్లోని సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరందించే నెర్రి కాలువ ఆధునీకీకరణకు రూ. 27 కోట్లు మంజూరయ్యాయి. పనులు మాత్రం జరగలేదు.

హామీ: నాయుడుపేట, సూళ్లూరుపేటల్లో ఎస్ఎస్ ట్యాంకుల నిర్మాణం.
అమలు తీరు: నాయుడుపేట, సూళ్ళూరుపేటల్లో గత టీడీపీ ప్రభుత్వం మంజూరుచేసి నిర్మాణంలోవున్న సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల పనులు ఈ ప్రభుత్వంలో పూర్తిగా ఆగిపోయాయి. నిర్మాణ స్థలాల్లోని సామగ్రిని కూడా కాంట్రాక్టర్లు తరలించేశారు. వేసవి వచ్చిందంటే ఈ రెండు పట్టణాల్లోనూ బిందె పది రూపాయలు పెట్టి కొనుక్కోవాల్సిన దుస్థితి.

హామీ: పులికాట్‌లో పూడికతీత
అమలు తీరు: ప్రకటనలకే పరిమితం. ఎలాంటి ముందడుగూ పడలేదు.

హామీ: కాళంగి గ్రాయిన్ నిర్మాణం
అమలు తీరు: ఐదు సార్లు టెండర్లు పిలిచినా ప్రభుత్వం నుంచీ బిల్లులు రావన్న భయంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. పనులు కదల్లేదు. ఎమ్మెల్యే చేతులెత్తేశారు.

హామీ: ఏడాదిలో వేనాడు-పేర్నాడు తారు రోడ్డు నిర్మాణం
అమలు తీరు: ఆ ఊసే లేదు.

హామీ: విన్నమాల పంట కాలువ పూడిక తీత, ఆధునికీకరణ
అమలు తీరు: నివేదికలకే పరిమితం.

హామీ: ఆరు నెలల్లో మీజూరు వద్ద చెక్‌డ్యామ్ నిర్మాణం
అమలు తీరు: అతీగతీ లేదు.

సూళ్లూరుపేట వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య తీరుపై భగ్గుమంటున్న జనం

అవినీతి సామ్రాట్

ఐదేళ్లూ అభివృద్ధి ఊసు లేకపోయినా అవినీతి, అక్రమార్జనల ఆరోపణల వెల్లువలో కిలివేటి నిలువునా తడిసి ముద్దయ్యారు. రాజకీయ ప్రత్యర్థులు చేసే ఆరోపణలైతే కొట్టిపారేయొచ్చు. కానీ సొంత పార్టీ నాయకులే బహిరంగ సమావేశాలు పెట్టి మరీ ఎమ్మెల్యే అవినీతి చిట్టా విప్పి చెప్పడం విశేషం. ఆయనను అడ్డుపెట్టుకుని కొందరు సన్నిహిత అనుచరులు, నాయకులు కూడా అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడ్డారనే విమర్శలూ వున్నాయి. ఆరోపణల్లో మచ్చుకు కొన్ని...

- గ్రావెల్, ఇసుక, రేషన్ బియ్యం, గంజాయి వంటి వాటి అక్రమ దందాలతో సంబంధం వుందని సొంత పార్టీ నేతలే ఆరోపించారు. ఈ దందాలతో ఎమ్మెల్యే, ఆయన అనుకూల వర్గ నేతలు రూ. కోట్లు వెనకేసుకున్నారన్న ప్రచారం నడుస్తోంది.
- సెటిల్‌మెంట్లకు దిగి వాటాలు అందుకోవడం, మాట వినని వారిని బెదిరించడం చేశారన్న ఆరోపణలున్నాయి.
- స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో నామినేషన్ ఉపసంహరించుకోవాలని సూళ్ళూరుపేటలో టీడీపీకి చెందిన బీసీ నాయకుడు వెంకటసుబ్బయ్యను బెదిరించారనే ఆరోపణలున్నాయి.
- సూళ్ళూరుపేటలోని ఓ ప్రైవేటు హోటల్ స్థల వివాదంలోనూ తలదూర్చి భారీ మొత్తం వసూలు చేశారనే ప్రచారం జరిగింది.
- నాయుడుపేటలో టిడ్కో ఇళ్ళ సముదాయం వద్ద భారీ ఇసుక నిల్వలను కరిగించి రూ.2 కోట్లకు విక్రయించారని, అక్కడున్న స్టీలు, సిమెంట్ కూడా మాయం చేశారనే ఆరోపణలున్నాయి.
- పెళ్ళకూరు మండలం శిరసనంబేడు కొండలో అనుచరుల ద్వారా గ్రావెల్, మట్టి తవ్వకాలు సాగించారని, జాతీయ రహదారి కాంట్రాక్టరు సహకారంతో రూ. కోట్లు సంపాదించారనే ఆరోపణలున్నాయి.
- స్వర్ణముఖి నదిలో ఇసుకను అక్రమంగా తరలించి భారీగా వెనకేసుకున్నారనే ప్రచారముంది.
- ఇరిగేషన్ శాఖలో రూ. 70 కోట్ల వరకూ పనులు తీసుకుని కాంట్రాక్టర్ల నుంచీ భారీగా కమీషన్లు వసూలు చేశారని, పెద్దగా లాభాలు వుండవని ఆ పనులు ఆపేసినట్టు ప్రచారం జరుగుతోంది.
- నాయుడుపేటలో టిడ్కో ఇళ్ల స్థలాల చదును పేరిట రూ. 4 కోట్లు బిల్లులు చేసుకున్నారని, వాస్తవంగా అందులో 30 శాతం కూడా ఖర్చు చేయలేదన్న ఆరోపణలున్నాయి.
- కొవిడ్ సమయంలో నాయుడుపేట సెజ్ పరిశ్రమల నుంచీ సుమారు రూ. 4 కోట్లు వసూలు చేశారని, అందులో పావు వంతు కూడా ప్రజలకు ఖర్చు చేయలేదన్న ఆరోపణలున్నాయి.
- రియల్ ఎస్టేట్ వెంచర్లకు సంబంధించి అప్రూవల్స్‌ను అడ్డుకుని వారి నుంచీ రూ. కోట్లు వసూలు చేశారని ఆరోపణలు వున్నాయి.
- ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టినా చివరికి సొంత పార్టీ వారైనా కూడా పోలీసులతో బెదిరించడం, కొట్టించడం వంటివి చేశారనే ఆరోపణలున్నాయి.
- ఎమ్మెల్యే వర్గంలో ప్రధాన నాయకుడైన డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిని వ్యతిరేకించిన వైసీపీ నాయకుడు రాకేష్‌రెడ్డిని స్తంభానికి కట్టేసి కొట్టించారనే ఆరోపణను ఎదుర్కొంటున్నారు.

ఇదీ మందుల



నేతల దర్శనానికి 'బ్రేక్'

తిరుమల కొండపై శ్రీవేంకటేశ్వరస్వామి వీఐపీ బ్రేక్ దర్శనమంటే గుర్తుకొచ్చేది రాజకీయ నాయకులే. మంత్రులో, ఎమ్మెల్యేలో, ఇతర పదవుల్లో కొలువుదీరేవారో సుప్రభాత వేళ సకుటుంబ పరివారంగా స్వామి దర్శనానికి బారులు తీరేవారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడ్డాక రాజకీయ నాయకుల తాకిడి తగ్గిపోయింది. వీరంతా ఎవరికి వారు నియోజకవర్గ రాజకీయాలతో బిజీ అయిపోయారు. నియోజకవర్గం కదిలివేళ్లేందుకు ఎవరూ సాహసించడంలేదు. ఈలోగా ఏ పరిణామం జరుగుతుందోననే భయం వెంటాడుతోంది. ఈనేపథ్యంలోనే మార్చి నుంచే తిరుమలకు వీఐపీ నాయకుల రాక తగ్గుముఖం పట్టింది. ఏప్రిల్ రెండోవారం నుంచి వీరుకనిపించకుండా పోయారు. దీంతో వీఐపీ బ్రేక్ సమయాన్ని టీటీడీ అధికారులు తగ్గించారు. సామాన్య భక్తులంతా రెండుమూడు గంటల్లోనే స్వామిని దర్శించుకుంటున్నారు. వీఐపీ గదులు కూడా ఇప్పుడు దర్శన టికెట్ ఉంటే చాలు సులభంగా దొరుకుతున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ప్రచారానికి సన్‌స్ట్రోక్



మాయదారి ఎన్నికలు మాంచి ఎండల్లో వచ్చాయి. ప్రచారం మహా కష్టంగా ఉందంటూ తెగబాధ పడిపోతున్నారు పార్టీల అభ్యర్థులు. గెలవాలి కాబట్టి మేమైతే కష్టమో నష్టమో తిరుగుతాం.. వెంటొచ్చే కార్యకర్తల,జనాల మాటేంటంటూ టెన్షన్ పడిపోతున్నారు. సమయం చూస్తే దగ్గరకొచ్చేస్తోందంటూ హైరానా పడుతున్నారు. విపరీతంగా కాస్తున్న ఎండలకు భయపడి ప్రచారానికి కార్యకర్తలు ముందుకురావడం లేదు. వచ్చినా ఉదయం 8 నుంచి 10 గంటల వరకు.. సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు మాత్రమే ఉంటామంటున్నారు. మిట్టమధ్యాహ్నం తిరగడం మావల్ల కాదని నిర్మొహమాటంగా చెప్పేస్తున్నారు. దీంతో ఏం చేయాలో నాయకులకు పాలుపోవడం లేదు. ఉదయం, సాయంత్రం ప్రచారానికి వస్తున్న వారికి రెండు విడతలుగా రూ. 200 వంతున ఇవ్వాల్సి వస్తుందని నాయకులు లెక్కలేసుకుని తలపట్టుకుంటున్నారు. డబ్బులు కాకుండా మంచినీళ్ళ, మజ్జిగ ప్యాకెట్లూ షరామామూలే. వాస్తవంగా ఇప్పటికే బూత్‌కు రూ.3వేల నుంచి రూ.4 వేల వరకు పంపిణీ చేశారు. రెండు పూటలు డబ్బులివ్వాలనే కొత్త డిమాండ్ రావడంతో ఖర్చు తడిసిమోపెడవుతోందని పార్టీ నాయకులు గొణుక్కుంటున్నారు.

- తడ

జగన్ డోర్ డెలివరీ

- ఇంటికే రేషన్ సరుకులంటూ నాడు హామీ
- వీధిలో వాహనం దగ్గర ప్రజలకు తప్పని తిప్పలు



ఇంటికే డెలివరీ అంటూ జగన్ ప్రభుత్వం చేసిన ప్రకటన ఆచరణలో అపహాస్యం పాలైంది. అంతేకాదు రేషన్ సరుకుల్లోనూ కోతలు విధించి జనానికి నరకం చూపిస్తోంది. 2019 మ్యానిఫెస్టోలో రేషన్ సరుకులు నేరుగా ఇంటికే అందజేస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగా 2021 ఫిబ్రవరి నుంచి సీఎం జగన్ రేషన్ వాహనాలను ప్రారంభించారు. విజయవాడ బెంజ్ సర్కిల్‌లో పెద్ద ఎత్తున ఇందుకోసం భారీగా హడావిడి చేశారు. పది వేల రేషన్ వాహనాలను వరసగా పెట్టి మరీ ఆర్భాటం చేశారు. ఇంటికే సరుకులు వచ్చేస్తాయని సంబరపడిపోయిన జనం అసలు విధానాన్ని చూసి నీరసపడ్డారు. రేషన్ కేంద్రాల ముందుండే జనాలు ఇప్పుడు రేషన్ వాహనాల ముందు క్యూ కడుతున్నారు. డోర్ డెలివరీ చేస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం వీధిలో వాహనాన్ని నిలుపుతోంది. వీధిలో వారంతా అక్కడికే వచ్చి తీసుకోవాలని నిబంధన పెట్టింది.

● మోసం గురూ

ఇంటికి తీసుకువచ్చి ఇవ్వకుండా ఇలా వీధి చివర ఎండలో వాహనం ముందు నిలబెట్టడం కన్నా పాత పద్ధతిలో దుకాణాల్లోనే ఇవ్వచ్చు కాదా అంటూ విమర్శిస్తున్నారు. పైగా రేషన్ వాహనం రావడానికి ఓ టైం షెడ్యూలు ఉండదు. వచ్చినప్పుడే తీసుకోవాలి. ఒక వేళ పనుల్లోపడి వాహనం వద్దకు వెళ్లలేపోతే ఆ నెల రేషన్ ఉండదు. ఈ కొత్త రేషన్ పద్ధతిపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

- తిరుపతి(ఆంధ్రజ్యోతి)

ప్రతినెలా సరుకుల్లో కోత

హామీల్లోనే కాదు..రేషన్ సరుకుల్లోనూ వైసీపీ ప్రభుత్వం కోతలతో ప్రజలను మోసగిస్తోంది. సాధారణంగా రేషన్ సరుకుల్లో బియ్యంతో పాటు చక్కెర, గోధుమపిండి, కందిపప్పు, రాగిపిండి ఇవ్వాలి. కానీ ఈ ఐదు సరుకులు సంపూర్ణంగా ఇచ్చిన దాఖలాలు ఈ ప్రభుత్వంలో లేనే లేవని లబ్ధిదారులు వాపోతున్నారు. కేవలం బియ్యం, చక్కెరతోనే సరిపెడుతున్నారు. జిల్లాలో 6,03,000 మంది లబ్ధిదారులున్నారు. 369 వాహనాల ద్వారా వీరికి రేషన్ సరుకులు పంపిణీ చేయాలి. ప్రతినెలా 8,350 టన్నుల బియ్యం, 286 టన్నుల చక్కెర, 180 టన్నుల కందిపప్పు, 65 టన్నుల గోధుమపిండి అందించాలి. కానీ బియ్యం, చక్కెర తప్ప మిగిలిన సరుకులేవీ కనిపించవు. అడిగినా సమాధానం ఉండదు. లేదా 'ఇచ్చింది తీస్కో' అనే బుకాయింపు వినిపిస్తుంది. ఈనెల సరుకులను పరిశీలిస్తే ఆశ్చర్యపోక తప్పదు. 286 టన్నుల చక్కెరకు కేవలం 130 టన్నులు మాత్రమే జిల్లా వ్యాప్తంగా పంపారు. 180 టన్నుల కందిపప్పుకుగాను 15 టన్నులు మాత్రమే పంపారు. అంటే 165 టన్నుల కందిపప్పు పంపిణీని ఎగ్గొట్టారు. గోధుమ పిండి కూడా 55 టన్నులకే పరిమితం చేశారు.


రోడ్డు మీద నిలబెడుతున్నారు



డోర్ డెలివరీ అంటే క్యూలైన్‌లో నిలబడే బాధ తప్పిందనుకున్నాం. కార్యక్రమం ప్రారంభమైన తర్వాత కానీ అసలు విషయం తెలియలేదు. మొదట్లో రేషన్ సరుకులన్నీ ఇంటికే వచ్చి ఇస్తారనుకున్నాం. సంతోషపడ్డాం. కానీ వ్యాన్ వీధిలో ఎక్కడో చోటకు వస్తోంది. అక్కడకు వెళ్లి నిలబడాల్సి వస్తోంది. ఇంతకుముందు రేషన్ షాపుల ముందు నిలబడేవాళ్లం. అయినా నిడబడటం, నిరీక్షణ మాత్రం తప్పలేదు.

-వాటంబేడు భాస్కర్

వేతన జీవుల వెతలు విన్న 'గుర్తు'లేకా...



ఇన్నాళ్లూ నరకం చూపించి ఇప్పుడు ఎక్కడలేని ప్రేమా ఒలకబోస్తున్న అధికార వైసీపీ నేతల తీరు చూసి ప్రభుత్వోగులు అవాక్కయ్యారు. జీతాలు పడలేదంటే నిన్నమొన్నటి వరకూ వెకిలి నవ్వులు నవ్వి తాజాగా వంగి వంగి దండాలు పెడుతుంటే విస్తుపోయారు. ఆదివారం ఎస్వీఆర్ట్స్ కళాశాల కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేసేందుకు వచ్చిన ప్రభుత్వోద్యోగులను ప్రసన్నం చేసుకోడానికి వైసీపీ నేతలు 'గుర్తు' చెబుతూ ఆడిన నాటకాలు అన్నీఇన్నీ కావు. మండుటెండలోనూ చెమటలు కక్కుతూ తమను ఆకర్షించేందుకు వీరు చేసిన ప్రయత్నాలను చూసి ఉద్యోగులు ముసిముసిగా నవ్వుకున్నారు.

- తిరుపతిరూరల్

వీడు మనోడేనంటావా...

ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ నియోజకవర్గ ముఖ్యనేతను అనుమానం దహించేస్తోంది. ఎవరిని నమ్మాలో..ఎవరిని నమ్మకూడదో తేల్చుకోలేకపోతున్నారు. నమ్మి పెత్తనమిస్తే కొంప ముంచుతారేమోనని సంశయిస్తున్నారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి మొదటి నుంచి కష్టపడిన, పట్టున్న నాయకులను పక్కన పెట్టి సొంత కోటరీని నిర్మించుకున్నాడాయన. ఏరికోరి కొత్తవారిని ఏకగ్రీవాలు చేయించుకున్నారు. ఇంకేముంది. అంతా తనవాళ్లేనని కాలర్ ఎగరేశారా ముఖ్య నేత. ఎన్నికలు సమీపించడంతో ఈమధ్య స్థానిక ప్రజాప్రతినిధులను తిరుపతికి పిలిపించుకున్నారు. ఓ హోటల్‌లో భారీ విందు ఇచ్చి బాగా పనిచేయాలన్నారు. పొగడ్తలతో ముంచెత్తారు. తర్వాతే ముఖ్యనేత అసలు స్వరూపం బయటపడింది. వీరందరినీ ఒకరికి తెలియకుండా మరొకరిని రూమ్‌లోకి పిలిపించుకున్నారు. పార్టీ పరిస్థితి, వీడిపోయే వారెవరు.. కోవర్టులున్నారా అంటూ ఆరా తీశారు. వీరంతా ఒకరిపై ఒకరు అనుమానాలను వెళ్లగక్కేసరికి ఆ పెద్ద నాయకుడు అవాక్కయ్యారు. వీరందరి గురించి విచారణ మొదలుపెట్టారు. చేసేదిలేక అందరినీ అనుమానిస్తూనే ఇప్పుడు వార్డు,గ్రామాల్లో పంపకాలు బాధ్యతలు అప్పగించారు. అయినా అనుమానం పోలేదు. కీలక పంపకాలు సరిగా చేస్తారా లేదా అని సందేహిస్తూనే ఉన్నారు.

- రేణిగుంట

